# ప్రజా తపన

prajathapana.com

News that matters




**సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానంగా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.**

**- స్వామి వివేకానంద**


సంపుటి :01 సంచిక: 197 బుధవారం 13 సెప్టెంబర్ 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


## శాంతి భద్రతలపై సిఎం జగన్ సమీక్ష

**విజయవాడ, సెప్టెంబర్ 12**



స్కిల్ డెవలప్మెంట్ స్కామ్ కేసులో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్ తో పలు పార్టీలకు చెందన నేతలు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నారు. దీంతో నేడు ( మంగళవారం ) విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలోని శాంతి భద్రతలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గత పది రోజులుగా జరిగిన పరిణామాలను సీఎం జగన్ కు కసిరెడ్డి రాజేంద్రనాథ్ రెడ్డి సహా పోలీస్ శాఖ ఉన్నతాధికారులు వివరించారు. ఇక, చంద్రబాబు అరెస్ట్ తదనంతర పరిణామాలను ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి సీఎం జగన్ కు వివరించారు. కోర్టులో జరిగిన వాద ప్రతివాదనల తీరును పోన్నవోలు వివరించారు. చంద్రబాబు అరెస్ట్ సందర్భంగా టీడీపీ చేపట్టిన ఆందోళనలు.. నిన్నటి బంద్ వంటి అంశాలను సీఎం జగనుకు పోలీస్ అధికారులు తెలియజేశారు. మరి కొంత మంది అరెస్టులు ఉంటాయనే ప్రచారంతో సీఎం జగన్ లా అండ్ ఆర్డర్ రివ్యూ ప్రాధాన్యత సంతరించుకుంది అయితే, భవిష్యత్‌లో రాష్ట్రంలో శాంతి భద్రతలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, పార్టీ ముఖ్య నేతలు వైవీ సుబ్బారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ సీతారామాంజనేయులు, ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. చంద్రబాబు క్వాష్ పిటీషన్స్కిల్ డెవలప్ మెంట్ స్కాం లో టీడీపీ అధినేత చంద్రబాబుపై సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ను కొట్టేయాలని ఆయన తరపున న్యాయవాదులు

02

## భారత్‌లో పీఓకే కలుస్తుంది...

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12**



పాక్ ఆక్రమిత కశ్మీర్ దానంతట అదే త్వరలో భారత్‌లో కలుస్తుంది, కాస్త వేచి ఉండండి అంటూ కేంద్ర మంత్రి జనరల్ వీకే సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజస్థాన్‌లోని దౌసాలో ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రిని విలేకరులు ఈ అంశంపై ప్రశ్నించగా ఆయన వై విధంగా సమాధానమిచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు. బీజేపీ చేపడుతున్న పరివర్తన్ సంకల్ప్ యాత్రలో భాగంగా వీకే సింగ్ దౌసాలో విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. అయితే పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలోని వారు భారత్‌లో కలిసిపోయేందుకు డిమాండ్ చేస్తున్నారు దీనిపై స్పందించమని అడగగా ' పీఓకే త్వరలోనే భారత్‌లో దానంతట అదే కలిసిపోతుంది. కాస్త సమయం వేచి ఉండండి' రిటైర్డ్ ఆర్మీ చీఫ్ జనరల్ వీకే సింగ్ బదులిచ్చారు. ఇటీవల చైనా భారత్‌లోని అరుణాచల్‌ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలను, ఆక్సాయ్‌చిన్‌ను తమ భూభాగంగా చూపిస్తూ మ్యాప్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇది జరిగిన కొద్ది రోజుల్లోనే వీకే సింగ్ ఈ విధంగా మాట్లాడడం ఆసక్తి కలిగిస్తోంది. 2023 చైనా స్టాండర్డ్ మ్యాప్ పేరుతో చైనా విడుదల చేసిన మ్యాప్‌పై భారత్ తీవ్ర వ్యతిరేకత వ్యక్తంచేసింది. భారత్‌తోపాటు పొరుగున ఉన్న ఇతర దేశాలు కూడా చైనా చర్యలను తీవ్రంగా ఖండించాయి. అలాగే పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉంటున్న ప్రజలు తాము భారత్‌తో కలిసిపోతామని డిమాండ్లు చేస్తున్నారు. ఇటీవల పెద్ద ఎత్తున ర్యాలీలు కూడా నిర్వహించారు. అక్కడి షియా ముస్లింల నుంచి డిమాండ్లు ఎక్కువగా వస్తున్నాయి. భారత్‌తో ఉన్న సరిహద్దును తెరవాలని తాము భారత్‌తో కలుస్తామని వారు గట్టిగా చెప్తున్నారు. భారత అధ్యక్షతన జరిగిన జీ20 సదస్సు విజయవంతం కావడంపైన మంత్రి వీకే సింగ్ ప్రశంసలు కురిపించారు. ఈ సమ్మిట్ విజయం వల్ల ప్రపంచ వేదికపై భారత్‌కు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని, ప్రపంచ దేశాల్లో భారత్ సత్తాను చాటుకుందని ఆయన వెల్లడించారు. జీ20 గ్రూప్‌లో ప్రపంచంలోని అన్ని శక్తివంతమైన దేశాలు ఉన్నాయని, భారత్ ఈ సమావేశాలను నిర్వహించడం ఇదే తొలిసారి అని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈ సమావేశాలను అద్భుతంగా నిర్వహించారని కొనియాడారు. ఈ సదస్సుతో భారత తన సత్తా చాటుకుందని అన్నారు. అలాగే రాజస్థాన్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వంపై మంత్రి విమర్శలు చేశారు. రాష్ట్రంలో

02

## భారత్ కు అమెరికా ప్రశంసలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12**



భారత దేశం అధ్యక్షతన నిర్వహించిన జీ 20 సదస్సు ఎంతో ఉత్సాహంగా ముగిసింది. జీ 20 శిఖరాగ్ర సదస్సును భారత్ విజయవంతంగా నిర్వహించిందని అమెరికా ప్రశంసించింది. ఇది సంపూర్ణ విజయం అని అమెరికా పేర్కొంది. సోమవారం అమెరికాలో జరిగిన రోజువారీ ప్రెస్ కార్యక్రమంలో విలేకరులు జీ20 సదస్సు గురించి ప్రశ్నించగా యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ సమాధానమిచ్చారు. జీ20 సంపూర్ణంగా విజయవంతమైందని తాము కచ్చితంగా నమ్ముతున్నామని తెలిపారు. జీ 20 అనేది చాలా పెద్ద ఆర్గనైజేషన్. ఇందులో రష్యా, చైనా కూడా సభ్యులుగా ఉన్నాయి. ఈ సదస్సుకు రష్యా హాజరుకాకపోవడంపై ప్రశ్నించగా.. ఇందులో విభిన్నమైన అభిప్రాయాలు కలిగిన సభ్యులు ఉన్నారు, ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమాధికారాన్ని గౌరవించాలని పిలుపునిచ్చే డిక్లరేషన్‌ను ఈ సదస్సు విడుదల చేయగలిగిందని తాము విశ్వసిస్తున్నట్లు తెలిపారు. ఆ సూత్రాలను ఉల్లంఘించకూడదు అనేది ప్రధాన అంశమని, ఎందుకంటే ఉక్రెయిన్‌పై రష్యా దాడికి అదే కారణమని తెలిపారు. ఇది చాలా ముఖ్యమైన డిక్లరేషన్ అని భావిస్తున్నట్లు మిల్లర్ పేర్కొన్నారు. రష్యా పేరు ప్రస్తావించకుండా, జీ 20 సభ్యదేశాలు బాలి డిక్లరేషన్‌ను గుర్తు చేసుకున్నట్లు తెలిపారు. యూఎన్ చార్టర్ ఉద్దేశాలు, సూత్రాలకు అనుగుణంగా అందరూ పనిచేయాలని అన్నారు. ఉక్రెయిన్‌లో సమగ్ర, న్యాయమైన, ఎల్లప్పుడూ ఉండే శాంతి కోసం దేశాలు పిలుపునిచ్చినట్లు చెప్పారు. ప్రాంతాలను స్వాధీనం చేసుకునే బెదిరింపులు, బలప్రయోగాలకు దూరంగా ఉండాలని సభ్య దేశాలు గుర్తు చేసినట్లు తెలిపారు. ఉక్రెయిన్‌లో యుద్ధానికి సంబంధించిన బాలిలో జరిగిన చర్చను ప్రస్తావించారు. ఐరాస భద్రతా మండలి, ఐరాస జనరల్ అసెంబ్లీలో ఆమోదించిన తీర్మానాలను తాము పునరుద్ఘాటించినట్లు తెలిపారు. అన్ని దేశాలు వాటికి అనుగుణంగా వ్యవహరించాలని నొక్కి చెప్పినట్లు పేర్కొన్నారు. యూఎన్ చార్టర్‌కు అనుగుణంగా ఏదైనా దేశం ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమాధికారం, రాజకీయ స్వతంత్రానికి వ్యతిరేకంగా ప్రాదేశిక స్వాధీనం కోసం

02

## వచ్చేస్తున్న యూపీఐ ఏటీఎం

**ముంబై, సెప్టెంబర్ 12:**



డిజిటల్ చెల్లింపు లావాదేవీల విధానాన్ని పూర్తిగా మార్చేసింది. ఎవరైనా షాపింగ్‌కి వెళ్లాలన్నా, మార్కెట్ నుంచి కూరగాయలు కొనాలన్నా జేబులో పర్స్ లేకపోయినా ఫోన్ ఉంటే సరిపోతుంది. మీ చేతిలోని ఫోన్ సహాయంతో యూపీఐ చెల్లింపు చేయడం ద్వారా క్రయవిక్రయాలు సులభతరం అయ్యింది. అందుకు ఏటీఎమ్ కార్డు కూడా వినియోగించాల్సిన అవసరం లేదు. అయితే ఇన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ కొన్ని సార్లు జేడులో సరిపడా డబ్బులేక ఇబ్బందులు పడుతున్నాం. అలాంటి పరిస్థితుల్లో ఇతరులకు యూపీఐ పేమెంట్ చేసి డబ్బు తీసుకుంటుంటారు. లేదంటే ఏటీఎమ్‌కి వెళ్లి డబ్బు డ్రా చేసుకుంటారు. యూపీఐ లేదా ఆన్‌లైన్ చెల్లింపులు అందుబాటులో లేని సందర్భాల్లో కొంత ఇబ్బంది

02

## కలకలం రేపుతోన్న నిఫా వైరస్

**కోయంబత్తూర్ సెప్టెంబర్ 12**



ప్రమాదకరమైన నిఫా వైరస్ దేశంలో మరోసారి కలకలం రేపుతోంది. కేరళ రాష్ట్రం కోజికోడ్ లో జ్వరం కారణంగా రెండు అసహజ మరణాలు సంభవించాయి. దీంతో కేరళ ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. ఈ మరణాలకు నిఫా వైరస్ ఇన్ఫెక్షన్ కారణమని ఆరోగ్య శాఖ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కోజికోడ్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఈ ఇద్దరూ మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. ముగ్గురు చిన్నారులతో సహా మొత్తం నలుగురు

02



## కార్యకర్తలు ధైర్యంగా ఉండండి... మేమున్నాం

### కక్ష సాధింపులే జగన్ లక్ష్యం

### టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

**విజయవాడ, సెప్టెంబర్ 12**

చంద్రబాబు అరెస్టుతో కాస్త నిరాశలో ఉన్న పార్టీ కేడర్‌కు నందమూరి బాలకృష్ణ ధైర్యం చెప్పారు. నేను ఉన్నానంటూ భరోసా ఇచ్చారు. అధినేత అరెస్టుతో గుండె ఆగిన వారి కుటుంబాలను పరామర్శిస్తాను అన్నారు. చంద్రబాబు అరెస్టు టీడీపీలో ఓ కుదుపుగానే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రేపో ఎల్లుండో లోకేష్‌తోపాటు కీలకమైన నేతలను అరెస్టులు చేస్తారని వైసీపీ లీడర్లు, మంత్రులు బహిరంగంగానే చెబుతున్నారు. ఇలాంటి సమయంలో పార్టీకి ఎవరు అండగా ఉంటారు అనే ప్రశ్న తలెత్తింది. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పినట్టుగానే నందమూరి బాలకృష్ణ మీడియా సమావేశం జరిగింది. నేను ఉన్నాను ధైర్యంగా ఉండండి... పోరాడుదాం.. భయం వద్దు అంటూ తెలుగుదేశం కేడర్‌కు బాలకృష్ణ పిలుపునిచ్చారు.

02

# శాంతి భద్రతలపై సిఎం జగన్ సమీక్ష

(మొదటిపేజీ తరువాయి)

క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఏపీ హైకోర్టులో ఈ కేసు విచారణ రేపు విచారణకు వచ్చే అవకాశం ఉంది. రిమాండ్ ను సవాల్ చేస్తూ వేసిన రివ్యూ రివిజన్ పిటిషన్ లోనే క్వాష్ పిటిషన్ కూడా కలిపి వేసిన చంద్రబాబు తరపు లాయర్లు.అయితే, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిపై రాజకీయ కోణంతోనే కేసు పెట్టారని ఆయన తరపు లాయర్లు క్వాచ్ పిటిషన్ దాఖలు చేశారు. ఇక, రేపు కోర్టు నంబర్ 4లో ఈ కేసు విచారణకు రానుంది. ఈ పిటిషన్ కు సంబంధించి చంద్రబాబు సంతకం కావాల్సి ఉండటంతో అందకని రాజమండ్రి సెంట్రల్ జైల్లుకి ఏపీ హైకోర్టు అడ్వకెట్ లక్ష్మీ నారాయణ వెళ్లి కలినట్లు తెలుస్తుంది. ఆ సంతకాల ప్రక్రియ ముగిసిన తర్వాత తిరిగి విజయవాడకు చేరుకోనున్నారు. ఈ కేసులో జస్టిస్ శ్రీనివాస్ రెడ్డి ధర్మాసనం ముందుకు రానుంది. 17ఏ ప్రకారం రాష్ట్ర గవర్నర్ అనుమతి లేకుండా చంద్రబాబును ఎలా రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలిస్తారని ఈ పిటిషన్ లో చంద్రబాబు తరపు లాయర్లు పేర్కొన్నారు. ఇక, ఈ రెండు అంశాలకు సంబంధించి రేపు ఏపీ హైకోర్టులో విచారణకు రానుంది. ఇది కూడా ఈ కేసులో కీలకమైనది. ఇప్పటి వరకు చంద్రబాబుకు సంబంధించిన అన్ని కేసులు ఏసీబీ కోర్టులో విచారణ జరుగుతుంటే.. చంద్రబాబు అరెస్ట్ తర్వాత తొలి సారి ఏపీ హైకోర్టుకు వచ్చాయి.

# భారత్‌లో పీఓకే కలుస్తుంది...

(మొదటిపేజీ తరువాయి)

శాంతి భద్రతల పరిస్థితి అధ్వానంగా ఉందని దుయ్యబట్టారు. దీని వల్ల రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇందుకే బీజేపీ పరివర్తన్ సంకల్ప్ యాత్రను నిర్వహిస్తోందని అన్నారు. ప్రజలు పరివర్తన కోరుకుంటున్నారని , ఈ యాత్రకు తరలి రావాలని నిర్ణయించుకుంటున్నారని వీకే సింగ్ వెల్లడించారు. ఈ యాత్రకు రాష్ట్ర వ్యాప్తంగా అపారమైన మద్దతు లభిస్తోందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరని విలేకరులు ప్రశ్నించగా.. ఎన్నికలు వస్తే బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించకుండానే పోటీ చేస్తుందని, కేవలం ప్రధాని నరేంద్ర మోదీ చరిష్మాతోనే తాము పోటీలో దిగుతామని వీకే సింగ్ స్పష్టంచేశారు. పార్టీ ప్రజలకు ఉపయోగపడే నాయకులకు, ప్రజల నమ్మకం సాధించిన నాయకులకు, మంచి వారికి తప్పకుండా అవకాశం ఇస్తుందని ఆయన తెలిపారు.

# భారత్ కు అమెరికా ప్రశంసలు

(మొదటిపేజీ తరువాయి)

బెదిరింపులు, బలప్రయోగాలకు దూరంగా ఉండాలని చెప్పినట్లు తెలిపారు. అణ్వాయుధాల బెదిరింపులు, ఉపయోగం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు.' 'ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో యుద్ధ వాతావరణం నెలకొంది. అక్కడి ప్రజలు ఈ అశాంతి కారణంగా ఎంతగా నలిగిపోతున్నారో మేం అర్థం చేసుకోగలం. వాళ్లపై యుద్ధ ప్రభావం ఏ మేర ఉంటుందో కూడా అంచనా వేయగలం. ముఖ్యంగా ఉక్రెయిన్ విషయంలో మేమంతా ఒక్కటిగానే ఉన్నాం. గతేడాది బాలిలో ఏ తీర్మానాలైతే చేశామో వాటికి కట్టుబడి ఉన్నాం. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానాలకూ కట్టుబడే ఉంటాం. యూఎన్ ఛార్టర్‌కి అనుగుణంగా నడుచుకుంటాం. ఏ దేశంలో అయినా ఇలాంటి యుద్ధ వాతావరణం ఉన్నా, భూభాగాల ఆక్రమణలు జరుగుతున్నా కచ్చితంగా మిగతా దేశాలు ఖండించాలని అందులో స్పష్టంగా రాసుంది. ఈ పరిస్థితులకు తగ్గట్టుగానే జాయింట్ డిక్లరేషన్‌లో పలు అంశాలు ప్రస్తావించాం. ఇవి యుద్ధం చేసుకునే రోజులు కావు. థీమ్స్‌కి అనుగుణంగానే స్నేహ పూర్వకంగా ఈ సమస్యను పరిష్కరించుకోవాల్సి ఉంటుంది" జీ20 సదస్సుకు భారత్ ఆతిథ్యమివ్వడం ఇదే తొలిసారి. సెప్టెంబరు 9-10 తేదీల్లో దిల్లీలో ఈ సదస్సు ఘనంగా జరిగింది. ఈ సదస్సు నేపథ్యంలో భారతీయ సంప్రదాయం, కళలు ఉట్టిపడేలా విస్తృతమైన ఏర్పాట్లు చేశారు.

# వచ్చేస్తున్న యూపీఐ ఏటీఎం

(మొదటిపేజీ తరువాయి)

తలెత్తుతుంది. ముఖ్యంగా టూరిస్ట్ స్పాట్‌ల వద్ద ఇలాంటి సమస్యలు చాలాసార్లు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇప్పుడు ఈ సమస్యలను ఎదుర్కోవటానికి సులభమైన మార్గం మార్కెట్లోకి వచ్చింది. తాజాగా యూపీఐ ఏటీఎం అందుబాటులోకి వచ్చన సంగతి తెలిసిందే. దీని సహాయంతో మీరు కార్డు లేకుండా కూడా నగదు తీసుకోవచ్చు. ఐతే దీనిని ఎలా ఉపయోగించాలో చాలా మందికి తెలియదు. ఈ విధానానికి కూడా మీ దగ్గర ఏటీఎం ఉండాల్సిన అవసరం లేదు. ఫోన్ ఉంటే సరిపోతుంది. అదెలాగంటే..ముందుగా మీరు ఏదైనా యూపీఐ ఏటీఎంకి వెళ్లాలి. అక్కడ కార్డ్ లెస్ లావాదేవీపై క్లిక్ చేయాలి. ఆ తర్వాత స్క్రీన్‌పై డబ్బు డ్రా చేసే అప్షన్లు వస్తాయి. అందులో ఒక మొత్తాన్ని ఎంచుకోవాలి. మొత్తాన్ని ఎంచుకున్న తర్వాత, స్క్రీన్‌పె కోడ్ కనిపిస్తుంది. దాన్ని మీ ఫోన్‌తో స్కాన్ చేయాల్సి ఉంటుంది. స్కాన్ చేయడానికి మీ ఫోన్‌లో ఉన్న ఏదైనా యూపీఐ యాప్‌ని తెరిచి ఖీఖీ కోడ్‌ని స్కాన్ చేస్తే సరిపోతుంది. అంతేకాకుండా మీరు అనేక యూపీఐ ఖాతాలు ఉపయోగిస్తుంటే ఇక్కడ ఏ ఖాతాను ఎంచుకోవాలో కూడా ఆప్షన్లు వస్తాయి. ఖాతాను ఎంచుకున్న తర్వాత యూపీఐ పిన్‌ను నమోదు చేస్తే సరి. ఏటీఎమ్ నుంచి కార్డు లేకుండానే డబ్బు విత్ డ్రా చేసుకోవచ్చు.విత్ డ్రా తర్వాత మీ ఫోన్‌కు లావాదేవీకి సంబంధించిన మెసేజ్ కూడా వస్తుంది. అలాగే యూపీఐ ఏటీఎం నుంచి డబ్బు విత్‌డ్రా, నగదు ఉపసంహరణకు కూడా ఎక్కడా ఏటీఎమ్‌లో కార్డును ఉపయోగించాల్సిన అవసరం లేకుండానే డబ్బు విత్‌డ్రా చేసుకోవచ్చు. కాగా యూపీఐ ఏటీఎం ను లాంచ్ చేసిన సంగతి తెలిసిందే.

# కలకలం రేపుతోన్న నిఫా వైరస్

(మొదటిపేజీ తరువాయి)

రోగులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు వారు తెలిపారు. చనిపోయిన వారిలో ఒకరి బంధువు 22 ఏళ్ల వ్యక్తి ప్రస్తుతం ఆసుపత్రిలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎఅజ)లో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా 4, 9 సంవత్సరాల వయస్సు గల ఇద్దరు పిల్లలు, 10 నెలల శిశువు కూడా ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు. మృతి చెందిన ఇద్దరి నమూనాలను పూణేలోని ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. ఆ ఫలితాలు మంగళవారం సాయంత్రానికి వస్తాయని పేర్కొన్నారు. మరోవైపు నిఫా వైరస్ అనుమానంతో రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఆ శాఖ మంత్రి వీణా జార్జ్ సోమవారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు.కాగా దక్షిణ భారతదేశంలో తొలిసారి నిఫా వైరస్ కేసు మే 19, 2018లో కోజికోడ్ జిల్లాలోనే బయటపడింది. ఈ వైరస్ కారణంగా 2018, 2021లో మరణాలు నమోదయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. జంతువుల నుండి ప్రజలకు ఈ వైరస్ వ్యాపిస్తుంది. కలుషితమైన ఆహారం, ఈ వ్యాధి బారినపడిన వారి నుంచి ఇది నేరుగా మరో వ్యక్తికి సంక్రమిస్తుంది. ఈ వైరస్ లక్షణాలు తొందరగా బయటపడవు. ఈ వైరస్ కొందరిలో మెదడువాపుకు కారణమవుతుంది. ఒకసారి ఈ వైరస్ ఒంట్లోకి ప్రవేశించాక సాధారణంగా సగటున తొమ్మిది రోజుల్లో లేదా 4 నుంచి 15 రోజుల్లో లక్షణాలు కనిపిస్తాయి.

# కార్యకర్తలు ధైర్యంగా ఉండండి... మేమున్నాం

(మొదటిపేజీ తరువాయి)

స్వాతంత్ర్యం సమరం నుంచి ఎన్నో పోరాటాలు మనం చూశాం చదువుకున్నామని వాటి స్ఫూర్తితో పోరాడుదాం అన్నారు. ప్రజలు కూడా ఆలోచించుకోవాలని సూచించారు బాలకృష్ణ. ఇప్పటికే పన్ను పోటుతో ఇబ్బంది పడుతున్న జనం మరోసారి అవకాశం ఇస్తే మరింత దుర్భరం అవుతారని హెచ్చరించారు. ఆలోచిస్తూ కూర్చుంటే ఏపీ సర్వనాశనం అవుతుందని.. ప్రతి ఒక్కరూ సైనికుల్లా పోరాడాలని సూచించారు. ప్లాన్ చేసి చంద్రబాబును కేసుల్లో ఇరికించారని అలాంటి వాటికి భయపడి ఇంట్లో కూర్చునే రకం కాదన్నారు బాలకృష్ణ. చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటపడతారు అన్నారు. చంద్రబాబు అరెస్టుతో కొందరు ప్రాణాలు కోల్పోయారని వారి కుటుంబాలను త్వరలోనే పరామర్శిస్తాను అన్నారు. ఎవ్వరికీ భయపడనక్కర్లేదని కేడర్‌కు, ప్రజలకు సూచన చేశారు. నేను వస్తున్నా.. నేనే ముందుంటా పోరుదాం రండీ అంటూ ధైర్యం నింపారు. ఆలోచించడం కాదుని... రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు హిందూపురం ఎమ్మెల్యే. జగనుకు మనుషులేంటేనే అలర్జీ అని విమర్శించారు. ముచ్చి మూతి పెట్టుకుని ఎంగిలి మెతుకులు- విదిల్చే స్వభావం జగన్‌ది అన్నారు. రూ. 10 ఇచ్చి రూ. 100 గుంజుకునే రకం వైసీపీదన్నారు.హిందూపురంలో టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధే ఇప్పుడు కనిపిస్తోందన్నారు బాలకృష్ణ. వీళ్లు వచ్చాక తట్ట మట్టి కూడా వేసిందని చెప్పుకొచ్చారు. మాట తప్పని పార్టీ తమదన్నారు. మాట తప్పకపోవడం అనేది ఎన్టీఆర్ నుంచి పార్టీకి వారసత్వంగా వచ్చిందన్నారు. టీడీపీ ఎన్నో సంక్షోభాలు చూసిందన్నారు బాలయ్య. ఇప్పుడూ అధిగమిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఇవే కాదు ఇంకా కేసులు పెడతారని అంచనా వేశారు. జగన్ లండన్ ఎందుకెళ్లారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇవాళే జగన్ ఏపీకి వచ్చారంట.. ఈ హ్యాంగోవర్ దిగడానికి మరో పది రోజులు పడుతుందేమో అని ఎద్దేవా చేశారు. ప్రజాపక్షాన పోరాడతామన్నారు బాలయ్య. మన శక్తి అయిన యువతని స్ట్రీమ్ లైన్ చేయాలన్నారు. జగన్ ప్రభుత్వం మాత్రం వాళ్లను గంజాయికి బానిసలుగా మార్చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూపురంలో ప్రభుత్వాస్పత్రిలో పందులు.. పశువులు తిరుగుతున్నాయన్నారు. ఏపీని ప్రపంచ పటంలో లేకుండా జగన్ చేశారన్నారు. చంద్రబాబుపై కక్ష సాధింపుతో ఎలాంటి ఆధారాలు లేకుండా చట్టాలని అతిక్రమించి నేరాన్ని మోపారన్నారు నందమూరి బాలకృష్ణ. అభివృద్ధి, సంక్షేమానికి చంద్రబాబు ఓ బ్రాండ్... ప్రపంచ దేశాలే ఆయన గురించి చెప్పుకుంటున్నాయన్నారు. ఇప్పుడు పాలన గాలికి వదిలేసి ప్రతిపక్షాలపై కక్ష సాధించడమే లక్ష్యంగా జగన్ ముందుకెళ్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని భయంతో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఈ విషయంలో ఎలాంటి ఆధారాలు లేకుండా... తాను 16 నెలలు జైల్లో ఉన్నాను కాబట్టే చంద్రబాబు కనీసం 16 రోజులైనా పెట్టాలనే దురుద్దేశంతోనే స్కామ్‌ను క్రియేట్ చేశారన్నారు.

సంక్షేమాన్ని గాలికొదిలేసి ప్రతిపక్షాలపై కక్ష సాధింపులే లక్ష్యంగా జగన్ పనిచేస్తున్నారు. జగన్ జైలుకు వెళ్లొచ్చారని అందరినీ పంపాలని ప్రయత్నిస్తున్నారు. పేద విద్యార్థుల కోసం చంద్రబాబు ఎన్నో విద్యాసంస్థలు తీసుకొచ్చారు. హిందూపురంలో 1200 మందికి ఉద్యోగాలు ఇచ్చారు. వేలమంది యువతకు ఉపాధి కల్పించిన సంగతి మరిచారా? అవినీతి జరిగితే ఆధారాలు చూపించాలి కదా? అవినీతి జరిగితే ఛార్జిషీట్ ఎందుకు వేయలేదు ? రాజకీయ కక్షసాధింపులు తప్ప ఈ ప్రభుత్వం చేసిందేమీ లేదు. అభివృద్ధి, సంక్షేమానికి చంద్రబాబు ఒక బ్రాండ్. కక్ష సాధింపులే జగన్ లక్ష్యం. ఎన్నికల్లో పరాజయం తప్పదన్న భయంతోనే ఇలాంటి చర్యలు. స్కిల్ డెవలప్మెంట్ ముందుగా గుజరాత్లో ప్రారంభించారు.

సీఎం కేవలం పాలసీ మేకర్.. అధికారులే అమలు చేస్తారు. అజేయ కల్లం ప్రతిపాదిస్తే.. ప్రేమ్ చంద్రారెడ్డి అమలు చేశారు. ప్రభుత్వం రూ.370 కోట్లు ఖర్చు చేసింది. 2.13 లక్షల మందికి శిక్షణ ఇచ్చారు. డిజైన్ టెక్ సంస్థకు జగన్ ప్రభుత్వం అభినందన లేఖ ఇచ్చింది. జగన్.. ఒక్కరికైనా ఉద్యోగం ఇచ్చారా? చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటపడతారని అన్నారు.

ఇలాంటివి ఎన్నో చూశాం.. ఎవరికీ భయపడే ప్రసక్తే లేదు. ఉన్న సంస్థలు విధ్వంసం చేసి.. యువతను గంజాయికి బానిస చేశారు. జగన్ చేసే కుట్రలన్నీ ప్రజలు గమనిస్తున్నారు. ఇప్పుడు గాలికబుర్లు చెబుతున్నారు.. పీల్చే గాలిపై కూడా పన్నులు వేస్తారు. జగన్ పాలనలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడింది. పోలవరం ప్రాజెక్ట్ పడకేసింది. రాజధాని ఏదో తెలియని పరిస్థితి రాష్ట్రంలో వుందని అన్నారు.


జగన్ పై పీడీయాక్ట్, ఈడీ, సీబీఐ కేసులు ఉన్నాయి. 10 ఏళ్లుగా కోర్టుల చుట్టూ తిరుగుతున్నాడు. ప్రజలు అనుభవించింది చాలు.. మార్పుకోసం సైనికుల్లా పనిచేయాలి. మొరిగితే పట్టించుకోను.. అతిక్రమిస్తే ఉపేక్షించను. రాష్ట్రం కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాల్సిన సమయమిది. నేను మీ ముందుంటా.. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు. తెలుగువాడి పౌరుషం ఏంటో చూపిద్దామని అయన అన్నారు.

## బాలయ్య చేతికి టీడీపీ పగ్గాలు...?

ఎవ్వరికీ భయపడాల్సిన అవసరం లేదు.. నేనొస్తున్నా.. నేనుంటా.. తెలుగువాడి పౌరుషం ఏంటో చూపిద్దాం ఇది నందమూరి బాలకృష్ణ ప్రెస్ మీట్ ఎండింగ్‌లో చెప్పిన డైలాగులు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు రాజమండ్రి సెంట్రల్ జైల్‌లో ఉన్న తరుణంలో..బాలయ్య చెప్పిన ఈ మాటలు కేవలం కార్యకర్తలకు భరోసా ఇచ్చేందుకేనా..లేదా టీడీపీ నూతన సారథిగా బాలయ్య బాధ్యతలు తీసుకోబోతున్నారా..బాలయ్య ఇచ్చిన అభయం దేనికి సంకేతం అనే ఇప్పుడు ఇటు టీడీపీ, అటు వైసీపీ రెండు పార్టీల్లోనూ చర్చకు దారి తీస్తోంది.నిన్నటికి నిన్న అమరావతి టీడీపీ కేంద్రకార్యాలయంలో టీడీపీ సీనియర్ నేతలతో బాలకృష్ణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రులు యనమల రామకృష్ణుడు, నక్కా ఆనంద్ బాబు, అనగాని సత్యప్రసాద్, పట్టాభి ఇలా టీడీపీ క్యాడర్‌లో బాగా పేరున్న నేతలతో బాలయ్య ఒక్కరే సమావేశం నిర్వహించారు. లోకేష్ రాజమండ్రిలో తన తండ్రి కేసు వ్యవహారాలను దగ్గరుండి చూసుకుంటుండగా...మిగిలిన రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ కార్యకర్తలకు, క్యాడర్ కు ధైర్యమిచ్చే బాధ్యతలను బాలయ్య భుజాలకు ఎత్తుకున్నారని అర్థమవుతోంది. కానీ ఈ రోజు ప్రెస్ మీట్‌లో నేను ఉన్నా నేను వస్తాను కలిసి పోరాడదాం అన్న మాటలు దేనికి సంకేతమనేది ఇప్పుడు అసలు ప్రశ్న. బాలయ్య టీడీపీని కబ్జా చేసే ప్రయత్నాల్లో ఉన్నారనైతే వైసీపీ మంత్రులు ఇప్పటికే కౌంటర్స్ ఇవ్వటం మొదలు పెట్టారు కూడా.దీనికి రెండు కారణాలు కనిపిస్తున్నాయి మొదటిది నారా లోకేష్ అరెస్ట్. అవును లోకేష్ కూడా కొద్ది రోజుల్లో అరెస్టు అవుతారని చంద్రబాబు అరెస్ట్ సమయంలో స్పందించిన ప్రతీ మంత్రి మాట్లాడిన మాటే. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో లోకేష్ కూడా వారం రోజుల్లో సీఐడీ విచారణలో ఉంటారనేది మంత్రులు చెబుతున్న విషయం. మరి లోకేష్‌ను కూడా తండ్రి చంద్రబాబులానే రిమాండ్ కు తరలిస్తే పార్టీని నడిపించాల్సిన బాధ్యత తాత్కాలికంగానైనా బాలయ్యపై పడే అవకాశం ఉంటుంది. రెండో విషయం చంద్రబాబు అరెస్ట్‌తో ఏపీలో 23మంది గుండెపోటుతో మరణించారని టీడీపీ చెబుతోంది. వారి కుటుంబాలను కూడా స్వయంగా వెళ్లి పరామర్శిస్తానని బాలకృష్ణ రోజు మీడియా సమావేశంలో చెప్పారు. గతంలో వైఎస్సార్ మరణించిన సమయంలో చనిపోయిన రాజన్న అభిమానులను కలిసేందుకు వైఎస్ జగన్ కాంగ్రెస్ అధిష్ఠానంతో విబేధించి బయటకు వచ్చి ఓదార్పుయాత్ర చేపట్టిన అంశం ఇక్కడ ప్రస్తావించుకోవాలి. అలాగే బాలకృష్ణ కూడా ఇప్పుడు టీడీపీ అధినేత అరెస్ట్ కారణంగా కన్నుమూసిన కుటుంబాలను పరామర్శించి ధైర్యమిస్తారా... లేదా బాబు, లోకేష్ ఇద్దరూ జైలులో ఉండాల్సిన పరిస్థితులు వస్తే నూతన సారథిగా ఎన్నికల ముందు ఈ కీలక సమయంలో ముందుండి నడిపిస్తారా చూడాలి.

# చంద్రబాబు కస్టడీ పిటిషన్‌పై వాదనలు వాయిదా

**విజయవాడ, సెప్టెంబర్ 12**



స్కిల్ డెవలప్‌మెంట్ కుంభ కోణంలో ఏపీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్ట్ సంచలనం సృష్టించింది. చంద్రబాబుకు రిమాండ్ విధించి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. అయితే చంద్రబాబును ఐదు రోజుల కస్టడీ కోరుతూ సీఐడీ అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే కస్టడీ అవసరం ఏంటో చెబుతూ పిటిషన్ దాఖలు చేసింది. కస్టడీ పిటిషన్ వాదనలు రేపటి వాయిదా వేస్తూ కోర్టు వెల్లడించిది. కౌంటర్ పిటిషన్‌ను రేపు దాఖలు చేస్తామన్న చంద్రబాబు తరపు న్యాయవాదులు తెలిపారు. అయితే రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న చంద్రబాబు నాయుడుకు ప్రాణ హాని ఉందని, వెంటనే చంద్రబాబు నాయుడును హౌస్ రిమాండ్ విధించాలని చంద్రబాబు తరపున న్యాయవాదులు పిటిషన్ దాఖలు చేయగా, సా. 4.30 గంటలకు తీర్పు వెలవడనుంది.అలాగే తనపై కేసును కొట్టేయాలని హైకోర్టులో చంద్రబాబు క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. సరైన సాక్ష్యాలు లేకుండానే సీఐడీ కేసు నమోదు చేసిందన్న చంద్రబాబు ఆరోపించారు. సీఆర్‌పీసీ సెక్షన్ 482 కింద పిటిషన్ దాఖలు చేశారు. 20 పేజీలతో క్రిమినల్ పిటిషన్ మెమోరాండం దాఖలు, రిమాండ్ ఆదేశాలను కూడా సస్పెండ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. అయితే తదుపరి చర్యలపై స్టే విధించాలని చంద్రబాబు నాయుడు కోరారు. ప్రతివాదులుగా ఏపీ ప్రభుత్వం, స్కిల్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ అని, తనపై ఎటువంటి నిర్దిష్ట ఆరోపణలు లేవని చంద్రబాబు అన్నారు. రిమాండ్, స్పెషల్ కోర్టు చర్యలు చెల్లవని క్వాష్ పిటిషన్‌లో పేర్కొన్నారు చంద్రబాబు. రిమాండ్ రిపోర్టులో చెప్పిన విషయాలన్నీ అసంబద్ధమని చంద్రబాబు వాదిస్తున్నారు. ఆయన భద్రత ప్రభుత్వానిదే రాజమండ్రి, సెప్టెంబర్ 12చంద్రబాబుకు కట్టు దిట్టమైన భద్రత కల్పిస్తున్నామని ఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి చెప్పారు. చంద్రబాబును చాలా జాగ్రత్తగా చూసుకుంటున్నారని.. ఆయన రక్షణ రాష్ట్ర బాధ్యతని చెప్పుకొచ్చారు. జ్యుడిషియల్ కస్టడీలో ఉన్న ఏ వ్యక్తికైనా పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. అయితే రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న చంద్రబాబు భద్రతపై సందేహాలు తలెత్తడంతో అలాంటిదేమి లేదని, ఆయను హౌస్ రిమాండ్ అవసరం లేదని చెప్తూ ఆంధ్రప్రదేశ్ హోం శాఖ కార్యదర్శి, ప్రస్తుతం జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్‌గా పూర్తి అదనపు బాధ్యతలు ఉన్నహరీష్ గుప్తా అడ్వకేట్ జనరల్‌కు లేఖ రాశారు. చంద్రబాబుకు సంబంధించి కోర్టు జారీ చేసిన అన్ని ఆదేశాలు అమలు చేస్తున్నామని తెలిపారు.అలాగే చంద్రబాబు కోసం ప్రత్యేకంగా ఒక వార్డు కేటాయించామని, ఆయన ఉన్న వార్డు వైపు ఎవరిని అనుమతించడం లేదని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, బాబు భద్రతను వ్యక్తిగతంగా పర్యవేక్షించేందుకు సూపరింటెండెంట్‌ను కేటాయించామని పేర్కొంటూ రెండు పేజీలు లేఖ రాశారు. ఇంకా ఆ లేఖలో బాబు కోసం ప్రత్యేక వార్డు చెంతనే ఓ వైద్యుల బృందం కూడా ఉందని తెలిపారు. ఇదిలా ఉండగా.. చంద్రబాబు తరపు లాయర్లు ఆయన రిమాండ్‌ను సవాల్ చేస్తూ ఏపీ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. బాబు అరెస్ట్ చట్ట విరుద్ధమని పేర్కొంటూ బెయిల్ కోసం ఆయన లాయర్లు కోర్టును అభ్యర్థించారు. అయితే కోర్టు ఈ పిటీషన్‌పై రేపు విచారణ జరుపుతామని పేర్కొంది.కాగా, స్కిల్ స్కామ్ కేసులో ఏపీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఏసీబీ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. అనంతరం బాబును రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ కేసులో బెయిల్ ఇవ్వాలని ఆయన తరుపు లాయర్ సిద్ధార్థ్ లూథ్రా కోరినప్పటికీ కస్టడీకి ఇవ్వాలని సీఐడీ వాదనలను పరిగణలోకి తీసుకున్న కోర్టు బాబుకు రిమాండ్ విధిస్తూ తన నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ క్రమంలో బాబు భద్రతపై తమకు అనుమానాలు ఉన్నాయని, జైలును కూడా తమ కంట్రోల్‌కి తీసుకునేందుకు సీఎం జగన్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని, జరుగుతున్న పరిణామాలపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలంటూ టీడీపీ లీడర్ నిమ్మకాయల రాజప్ప అన్నారు. ఈ మేరకు హరీష్ గుప్తా బాబు భద్రతపై లేఖ రాశారు.

# ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు విద్యార్థులకు వెంటనే దుప్పట్లు పంపిణీ చేయాలి

**ఆర్ఎస్ వైఎఫ్ రాష్ట కార్యదర్శి శంకర్ డిమాండ్**

**రాయచోటు (ప్రజాతపన )సెప్టెంబర్ 12 :**

పట్టణంలో ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్ లోని విద్యార్థిని, విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులు దుప్పట్లను వెంటనే పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం -1 వద్ద రాయలసీమ విద్యార్థి యువజన సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు..

ఈ సందర్భంగా ఆర్ఎస్ వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కన్నెల్లూరు శంకర్ మాట్లాడుతూ రాజన్న సంక్షేమ రాజ్యం, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి ధ్యేయంగా, పేద, బలహీన వర్గాల విద్యార్థులను ఉన్నత స్థానాలకు తీసుకపోవటమే మా ప్రభుత్వం లక్ష్యమని డంకాల మోగించే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ హాస్టల్స్ లలో చదువుకునే విద్యార్థిని, విద్యార్థులకు దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు, ట్రంకు పెట్టెలు ఇవ్వకుండా సంక్షేమ హాస్టల్స్ విద్యార్థిని, విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడమే రాజన్న సంక్షేమరాజ్యమా అని వారు మండిపడ్డారు. జిల్లావ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనారిటీ సంక్షేమ హాస్టల్స్ లలో 20వేల మంది విద్యార్థినీ, విద్యార్థులు తమ చదువులను కొనసాగిస్తున్నటువంటి పరిస్థితి. రానున్నది వర్షా,చలి కాలం అలాగే దోమల బెడద కూడా ఎక్కువగా ఉంటుంది. విద్యార్థిని,విద్యార్థులు



దోమ కాటుకు గురి అయితే డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, విష జ్వరాలకు గురి అయ్యే ప్రమాదం ఉంది దీని ద్వారా ఆరోగ్యాలు పాడై వారి చదువులను సక్రమంగా కొనసాగించలేక భవిష్యత్తు అస్తవ్యస్తమయ్యే ప్రమాదం ఉంది. ఇది వారి బంగారు భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అలాగే చలి తీవ్రత పెరిగే ప్రమాదం కూడా ఉంది కాబట్టి వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తులో హాస్టల్ విద్యార్థినీ, విద్యార్థులకు ఎలాంటి అనారోగ్య ఆటంకాలు రాకుండా ఉండాలి అంటే రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, జిల్లా ఉన్నత అధికారులు వెంటనే స్పందించి దుప్పట్లు వారికి కావాల్సిన వస్తువులను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు లేనియెడల ఆర్ఎస్ వైఎఫ్ ఆధ్వర్యంలో హాస్టల్ విద్యార్థినీ, విద్యార్థులను కలుపుకొని ఆందోళనను ఉధృతం చేస్తామని వారు తెలిపారు.

ఈ సమావేశంలో ఆర్ఎస్ వైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఓరుగంటి నాగేంద్రబాబు, పట్టణ నాయకులు మహేష్,గణేష్,కిరణ్ కుమార్ తదితరులు ప్రజలు పాల్గొన్నారు

# అధికారంలోకి వస్తామనే భావనతో పనిచేయాలి

**బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి**



**విజయవాడ**

భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తామన్న భావనతో ముందుకు వెళ్లాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పిలుపునిచ్చారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన రాష్ట్రస్థాయి సమావేశానికి దగ్గుబాటి పురందేశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె అనేక విషయాలను ప్రస్తావించారు. వివిధ జిల్లాల పార్టీ అధ్యక్షులు, జిల్లాల ఇంఛార్జిలు, వివిధ మోర్చాల రాష్ట్ర అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో దగ్గుబాటి పురందేశ్వరి ప్రధాన ప్రసంగం చేశారు. జిల్లా స్థాయిలో కార్యక్రమాల రూప కల్పన పార్టీ సంస్థాగత నిర్మాణం అదేవిధంగా పోలింగ్ బూత్ స్థాయి వరకు పార్టీ విస్తరణకు అవలంభించాల్సిన అంశాలు ప్రస్తావిస్తునే మండల స్థాయిలో కార్యకర్తలతో సీనియర్ నేతలు మమేకం కావాలని కార్యకర్త ఆధారిత పార్టీ బిజెపి అందువల్ల ఆవిషయాలను మనసులో పెట్టుకుని పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ మీడియా మాధ్యమం ద్వారా పార్టీ కార్యక్రమాలను ప్రచారం చేయవలసిన అవసరం ఉందన్నారు అదేవిధంగా ఐటి విభాగం కూడా బలోపేతం చేసుకోవలసిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా సర్పంచ్ ల సమస్యల పై జిల్లాస్థాయిలో జరిగిన ఉధ్యమం వల్ల సర్పంచ్ ల సమస్యల విషయంలో బిజెపి బలంగా వాణిని వినిపించగలిగామన్నారు. నాభూమి.. నామట్టి కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు వివిధ రకాల కార్యక్రమాలు ఉంటాయని వాటి ని విజయవంతం చేద్దాం అన్నారు. క్షేత్రస్థాయిలో శక్తి కేంద్రాలను బలోపేతం చేయడానికి అవసరమైన సూచనలు చేశారు.జిల్లాస్థాయి పదాధికారులకు వివిధ రకాల భాధ్యతలు ఇవ్వడం ద్వారా క్షేత్రస్థాయి నాయకత్వాన్ని కార్యక్రమంలో భాగస్వామ్యం చేయడం ద్వారా పని వేగం పెంచినట్లు అవుతుందన్నారు. సమావేశంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బిట్ర శివన్నారాయణ, గారపాటి సీతారామాంజనేయ చౌదరి, సాగి కాశీ విశ్వనాధరాజు, దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నూతన పింఛన్ లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ...




**గుత్తి ( ప్రజా తపన )సెప్టెంబర్ 12 :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ జగన్మోహన్ రెడ్డి ప్రకారంగా కొత్త పింఛన్లు మంజూరు కార్యక్రమంలో భాగంగా గుంతకల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి , గుత్తి మండల సీనియర్ నాయకులు శ్రీనివాసరెడ్డి , గుత్తి మునిసిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్లు, గుత్తి మునిసిపల్ కౌన్సిల్ వారి చొరవతో 7వ సచివాలయం 12,13వ వార్డు పరిధిలో కొత్తగా మంజూరు అయిన పెన్షన్ లబ్ధిదారులకు అందజేసిన 12వ వార్డ్ కౌన్సిలర్ %ూ%.నజీర్,13వ వార్డు కౌన్సిలర్షేనా , వెల్ఫేర్ సెక్రెటరీ రఫీ ,జిల్లా మైనారిటీ వోక్‌బోర్డు సభ్యుడు . ఫయాజ్ , మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిఆన్సర్ , సచివాలయం కన్వీనర్ యునస్ ఖాన్, నూరి ఆష్మా , దాదా పీరా,గృహ సారథులు, వాలంటీర్ల సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తల చేతుల మీదుగా అందజేయడం జరిగినదని కౌన్సిలర్ నజీర్ వెల్లడించారు. తమకు పింఛను అందజేయుటకు కనిపించని దేవుళ్లుగా మా కృతజ్ఞతలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి గారికి అందజేస్తూ జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ తమ సంతోషం వ్యక్తపరిచారు.



# 3 వేలకు చేరువలో మొరాకో మృతుల సంఖ్య..



**మొరాకో సెప్టెంబర్ 12**

మొరాకో లోని అట్లాస్ పర్వతాల్లో 6.8 తీవ్రతతో సంభవించిన భారీ భూకంపం ఎంతటి విషాదాన్ని మిగిల్చిందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. భూకంపం ధాటికి కుప్పకూలిన భవన శిథిలాలను తొలగిస్తున్న కొద్దీ కుప్పలుగా శవాలు బయటపడుతున్నాయి. ఈ శక్తివంతమైన భూకంపం ధాటికి మరణించిన వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. తాజాగా మృతుల సంఖ్య 3,000 చేరువైంది.స్థానిక అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మృతుల సంఖ్య 2,862కు చేరింది. ఇక ఈ విపత్తుకు 2,500 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సుమారు 100 మంది మొరాకో రక్షణ బృందం సహాయక చర్యల్లో పాల్గొంటోంది.భూకంపం వచ్చి ఇప్పటికే 72 గంటలకు పైనే అయిపోయింది. దీంతో ప్రభావిత ప్రాంతాల్లో శిథిలాల కింద చిక్కుకున్న బాధితులు సజీవంగా బయటకు వస్తారన్న ఆశలు క్రమంగా సన్నగిల్లుతున్నాయి. భూకంపం కేంద్ర ప్రాంతమైన అట్లాస్ పర్వత ప్రాంతంలోని మారుమూల గ్రామాల్లో పరిస్థితి దయనీయంగా ఉంది. ఎక్కడ చూసినా గుట్టలుగుట్టలుగా శవాలే కనిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటంతో రవాణా వ్యవస్థ పూర్తిగా దెబ్బతినింది. దీంతో సహాయక బృందాలు అక్కడికి చేరుకోలేని పరిస్థితి. ఈ నేపథ్యంలోనే ఆయా ప్రాంతాల్లో శిథిలాల వెలికితీత ఇప్పటి వరకూ చేపట్టనేలేదు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.శుక్రవారం అర్ధరాత్రి సమయంలో మొరాకోలోని పర్యాటక ప్రాంతమైన మర్రకేష్ కు 70 కిలోమీటర్ల దూరంలోని అట్లాస్ పర్వత ప్రాంతంలో భారీ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కొద్ది సేపటికి 4.9 తీవ్రతతో 19 నిమిషాలపాటు పలు ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. మర్రకేష్‌కు 71 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉందని యూఎస్ జియోలాజికల్ సర్వే (జూఉూ) వెల్లడించింది. భూ అంతర్భాగంలో 18.5 కిలోమీటర్ల లోతులో కదలికలు సంభవించాయని తెలిపింది. ఆల్ హౌజ్, మర్రకేష్, క్వార్జాజేట్, అజిలాల్ సహా పలు ప్రావిన్సుల్లో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించినట్లు వెల్లడించింది. 120 ఏళ్లలో ఇంత భారీగా ప్రకంపనలు రావడం ఇదే మొదటిసారి అని స్థానిక అధికారులు తెలిపారు.

# నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా ఈ జాబ్ మేళా ఏర్పాటు

**రాజకీయాలకు అతీతంగా జాబ్ మేళా నిర్వహణ**

**ఇది నిరంతరాయంగా కొనసాగుతుంది**

**- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి**

**జాబ్ మేళా కార్యక్రమానికి యువత నుండి విశేష స్పందన**

**ఆయా కంపెనీలకు ఎంపికైన అభ్యర్థులకు మంత్రి చేతుల మీదుగా అపాయింట్మెంట్ లెటర్ లు**

**నిజామాబాద్**

బాల్కొండ నియోజకవర్గ నిరుద్యోగ యువతీ, యువకుల కోసం వేల్పూరు మండలం లక్కొరా ఏఎన్జి ఫంక్షన్ హాల్లో రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అధ్వర్యంలో మెగా జాబ్ మేళా కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ నిరుద్యోగ జాబ్ మేళాకు నియోజకవర్గ యువత నుండి విశేష స్పందన లభించింది. ఉద్యోగం కోసం తమ చిన్నారులతో వచ్చి మహిళలు జాబ్ మేళా ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. పలువురు మహిళలు పలు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 70 పైగా కంపెనీలు ఈ



జాబ్ మేళాలో ఇంటర్వ్యూలు నిర్వహించగా పలువురికి అక్కడికక్కడే ఆయా కంపెనీలకు ఎంపికైన అభ్యర్థులకు మంత్రి చేతుల మీదుగా అపాయింట్మెంట్ లెటర్ లు అందజేశారు. ఈ సందర్భంగా ఆశావహులను ఉద్దేశించి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రసంగించారు."ప్రజల ఆశీర్వాదం తో రెండు సార్లు గెలిచిన. ముఖ్యమంత్రి కేసీఆర్ గారి ఆశీర్వాదం తో మంత్రిగా అయ్యాను. ఏళ్లలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పనిచేశాను. ఇపుడు యువతకు ఉద్యోగాలు కల్పించే లక్షం తో ఇలాంటి జాబ్ మేలా లు చేపట్టినాము. ఇది రాజకీయ ప్రయోజనం కోసం చేసిన పని కాదు. రాజకీయాలకు అతీతంగా జాబ్ మేళా ఉంటది. ఇలాంటి జాబ్ మేళా లు నిరంతరం గా కొనసాగుతాయి. జాబ్ మేళా ను యువత పెద్ద ఎత్తున తరలివచ్చి సద్వినియోగం చేసుకున్నారు. ఇప్పటికే న్యాక్ ద్వారా 12 వేల మంది యువతకు ఉద్యోగాలు ఇప్పించాం. ఎంత దూరం అయిన ఒక్క అడుగు తో మొదలు అవుతాది. జీవితం లో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగిన వారైనా ప్రారంభం లో చిన్న స్థాయి నుండి వచ్చినవారే ఉంటారు. నేను 1990 లో 800 జీతానికి చేరి 1994 లో 16వేల జీతానికి చేరుకున్నాను. హైదరాబాద్ లో అప్పట్లో అదే హయ్యెస్ట్ సాలరీ. మనం గమ్యం చేరాలంటే ప్రయత్నం చేయాల్సిందే. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వాలు కూడా 1లక్ష 30 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించలేదు. అన్ని ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన ఏకైక ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం. యువ మంత్రి కేటీఆర్ కృషి వల్ల తెలంగాణ లో 9 లక్షల కొత్త ఐటి ఉద్యోగాలు సృష్టిచబడ్డాయి. యువత వారు తల్లి దండ్రులు గర్వపడేలా ఉన్నత స్థాయికి ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఆసరా ఫౌండేషన్ వారి సౌజన్యంతో జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించాం. భవిష్యత్ లో కూడా నిరుద్యోగ యువత కోసం మళ్లీ జాబ్ మేళా నిర్వహిస్తాం. ఇది ఇట్లే కొనసాగుతుంది. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నా శుభాకాంక్షలు." అని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ డా.మధు శేఖర్,రైతు నాయకుడు కోటపాటి నర్సింహ నాయుడు,పలువురు అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ డిక్లరేషన్ పాజిటివ్ సంకేతాల్ని ఇచ్చింది: చైనా

**బీజింగ్ సెప్టెంబర్ 12**

జీ20 సమావేశాల నిర్వహణపై .. చైనా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఢిల్లీ డిక్లరేషన్ ప్రపంచ వ్యాప్తంగా పాజిటివ్ సంకేతాన్ని పంపిందని డ్రాగన్ దేశం పేర్కొన్నది. రెండు రోజుల పాటు ఢిల్లీలో జరిగిన జీ20 సమావేశాలపై చైనా తన మౌనాన్ని వీడింది. ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న సవాళ్లను, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ రికవరీ కోసం ఆ గ్రూపు చేస్తున్న పనుల్ని చైనా ప్రశంసించింది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధంపై డిక్లరేషన్ కోసం భారత్ చేపట్టిన ప్రయత్నాల్ని చైనా మెచ్చుకున్నది. దీనిపై చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ స్పందించారు. ఢిల్లీ డిక్లరేషన్ తయారీ ప్రక్రియలో చైనా కూడా సహకరించిందన్నారు. తమ దేశం నిర్మాణాత్మక పాత్రను పోషించిందన్నారు.అభివృద్ధి చెందుతున్న దేశాల ఆందోళనల్ని పరిగణలోకి తీసుకున్నారని, సమగ్ర అభివృద్ధి కోసం ఏకగ్రీవంగా డిక్లరేషన్‌ను ఆమోదించినట్లు చైనా తెలిపింది. ఢిల్లీలో జరిగిన జీ20 సమావేశాలకు చైనా తరపున ఆ దేశ ప్రధాని లీ కియాంగ్ హాజరయ్యారు. ఉక్రెయిన్ అంశంపై తమ అభిప్రాయంలో ఎటువంటి మార్పు ఉండదని చైనా తెలిపింది. చర్చలు, సంప్రదింపుల ద్వారానే ఉక్రెయిన్ సమస్యను పరిష్కరించుకోవచ్చు అని తెలిపారు. ఉక్రెయిన్ సంక్షోభంపై శాంతి చర్చలకు తమ దేశం సహకరిస్తుందని ప్రతినిధి చెప్పారు.

## కెనాల్ సమీపంలో ఆర్టీసీ బస్సు బోల్తా



**భద్రాచలం**
విశాఖపట్నం మధురవాడ డిపో నుండి భద్రాచలం వెళ్తున్న లగ్జరీ ఆర్టీసీ బస్సు మంగళవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో అదుపుతప్పింది. ఫోర్ బై గ్రామంలోని కెనాల్ సమీపంలో బోల్తా పడింది. ఘటనా సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. పదిది ప్రయాణికులకు గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని మరో బస్సులో డొంకరాయి ఆసుపత్రికి తరలించారు. మోతుగూడెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది..

## రెండు బైకులు ఢీ-ముగ్గురు మృతి

**భద్రాద్రి**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లోని టేకులపల్లి మండలం 6వ మైల్ తండా ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనగా... ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. మృతి చెందిన వారి వివరాలు చూసుకుంటే టేకులపల్లి మండలంలోని రోళ్లపాడుకు చెందిన పొదెం సంతోష్(22), మడి నాగరాజు (20), టేకులపల్లి మండలంలోని లచ్చ తండాకు చెందిన బానోత్ లక్ష్మణ్ (30)గా పోలీసులు గుర్తించారు. ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మృతుల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. రోడ్డు ప్రమాదంలో ముగ్గురు చనిపోయారు అన్న విషయం తెలుసుకున్న ఇల్లందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ ఆసుపత్రి వద్దకు చేరుకొని వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియ చేశారు.

## భారీ కొండ చిలువ కలకలం

**రంగారెడ్డి**
రంగారెడ్డి రాజేంద్రనగర్ హసన్ నగర్ లో భారీ కొండచిలువ కలకలం రేపింది. సోమవారం రాత్రి లారీ పార్కింగ్ వద్ద శబ్దం రావడంతో ఉలిక్కిపడిన లారీ డ్రైవర్లు చుట్టుపక్కల వెతికారు. భారీ కొండచిలువ కనపించడంతో వారంతా ఒక్కసారిగా భయభ్రాంతులకు గురైయారు. కొండచిలువు పోడవు 20 ఫీట్ల దాకా వుంది. స్థానికులుపోలీసులకు, ఆటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. తరువాత కొండచిలువను పట్టుకోని అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. మొత్తానికి భారీ కొండచిలువను చూసి పోలీసులు, స్థానికులు కంగు తిన్నారు.

## బీసీ హాస్టల్ లో ర్యాగింగ్

### బాలిక జుత్తు కత్తిరించిన క్లాస్ మెట్స్

**చంద్రగిరి**
చంద్రగిరి ప్రభుత్వ సమీకృత బాలికల హాస్టల్ లో ర్యాగింగ్ భూతం పడగ విప్పింది. తొమ్మిదవ తరగతి చదువుతున్నవిద్యార్థిని జుట్టు ను పక్క నే వున్న బాయ్స్ హాస్టల్ విద్యార్థులు కత్తిరించి అమానుషంగా ప్రవర్తించారు.
చంద్రగిరి ప్రభుత్వ బాలికల హాస్టల్ పక్కనే వున్న బాయ్స్ హాస్టల్ లోని కొందరు పోకిరీ విద్యార్థులు సభ్య సమాజం తల దించుకునేలా ప్రవర్తించారు. బాధిత బాలికను మానసికంగా వేదించారు. ఈ సమీకృత వసతి గృహం అనేక వివాదాలకు నిలయంగా మారింది.
గతం లో ఈ హాస్టల్ లో మత్తు పదార్థాలు కూడా విద్యార్థులు వద్ద దొరికినట్టు సమాచారం. హాస్టల్ లో ఉంటున్న కొదరు విద్యార్థులు గ్యాంగ్ లు గా ఏర్పడి ఇతర విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం బట్టలు విప్పమని బెదిరించడం, కాళ్ళు పట్టమనడం వంటి చేష్టలతో హాస్టల్లో ఉంటున్న విద్యార్థినీ విద్యార్థులను భయభ్రాంతులను గురి చేస్తున్నట్టు సమాచారం. ఇప్పటికైనా పోలీసు వారు ఇటువంటి అసాంఘిక చర్యలకు పాల్పడే విద్యార్థుల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## మరిన్ని స్కామ్ లు బయటకు రానున్నాయి

**విశాఖపట్నం**
చంద్రబాబు అరెస్ట్ వ్యవహారంలో టీడీపీ నేతలు చేస్తున్న ఆరోపణలపై మంత్రి గుడివాడ అమర్నాథ్ తీవ్రంగా స్పందించారు. ఇది రాజకీయ కక్ష సాధింపు కాదని స్పష్టం చేశారు. అంతేకాదు, చంద్రబాబు తర్వాత జైలుకి వెళ్లేది ఎవరో మంత్రి గుడివాడ అమర్నాథ్ చెప్పారు. త్వరలో మరిన్ని స్కామ్ లు బయటకు వస్తాయని బాంబు పేల్చారాయన.దాదాపు 40 సంవత్సరాలుగా రాజకీయాల్లోకి వచ్చి ఏపీ సీఎంగా పలు అవినీతి అక్రమాలకు పాల్పడిన చంద్రబాబు జైలు పాలయ్యారని. అభినవ వీరప్పన్ చంద్రబాబు ఖైదీ నంబర్ 7691 చంద్రబాబు ఇంతకాలం చట్టం నుంచి తప్పించుకున్నారని . అడవుల్లో ఉన్న వీరప్పన్ ఎలా తప్పించుకోలేకపో యారో అలాగే చంద్రబాబు కూడా తప్పించుకోలేకపోయారని స్కిల్ కుంభకోణం, ఫైబర్ నెట్, అమరావతి ల్యాండ్ ఇలా ఎన్నో స్కాంలు చంద్ర బాబు చేశారని అన్నారు.సీమెన్స్ వ్యవహారాల్లో 371 కోట్ల డబ్బు మీ జేబుల్లోకి వెళ్లిందని కోర్టులు నమ్మా యని,అందుకే చంద్రబాబు జైలుకి వెళ్లారని,ఇందులో రాజకీయ కక్ష ఏ మాత్రం లేదని చెప్పారు.

# పొలిటికల్ మలుపులు తిరుగుతున్న స్కిల్ స్కామ్

**ఏలూరు, సెప్టెంబర్ 12:**

ఏపీ పాలిటిక్స్‌లో ఎన్నడూ చూడని సీరియస్ ఎపిసోడ్ నడుస్తోంది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో పక్కా ఆధారాలు ఉన్నాయంటూ మాజీ సీఎం చంద్రబాబును అరెస్ట్ చేశారు. పొలిటికల్‌గా కూడా ఈ ఇష్యూని టీడీపీ మరింత ముందుకు తీసుకుపోతుందా? ఏపీ రాజకీయాల్లో ఇకపై జరగబోయేది ఏంటి తనను అరెస్ట్ చేయొచ్చు అని చంద్రబాబు అనడమే.. ఏదో జరగబోతోందనే సిగ్నల్ పంపింది. దానికి తగ్గట్టే వైసీపీ నేతలు కూడా రెండు మూడు రోజులుగా అరెస్ట్ గురించి మాట్లాడారు. ఫైనల్లీ పోలీసులు అర్ధరాత్రి బస్ డోర్ కొట్టారు, ఉదయానికల్లా చంద్రబాబును అరెస్ట్ చేసి తీసుకెళ్లారు. ఇదీ జరిగిన కథ. ఈ మొత్తం ఎపిసోడ్‌ను 370 కోట్ల రూపాయల స్కామ్‌గా చూడడం కంటే రాజకీయ కోణంలోనే జనం చూస్తున్నారన్నది నిజం. వైసీపీ నేతల కామెంట్లు కూడా దీనికి మ్యాచ్ అవుతున్నాయి. ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతను అరెస్ట్ చేస్తే సానుభూతి వస్తుందని మాకు తెలీదా అని కామెంట్ చేశారు మంత్రి అంబటి రాంబాబు.స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో డబ్బు ఎటు నుంచి ఎటువైపు వెళ్లిందని నిర్ధారించడంలో టైం పట్టింది తప్ప, ఇందులో రాజకీయ కక్ష ఏం లేదంటూ స్పష్టత ఇచ్చారు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి. సహజంగానే.. ఇది రాజకీయ కక్ష సాధింపు అనే లైన్‌లో వెళ్లింది ప్రతిపక్ష టీడీపీ. రాజకీయ అంశాలను వ్యక్తిగత కక్షగా మార్చుకుని చంద్రబాబుపై పగ సాధిస్తున్నారని కామెంట్ చేశారు టీడీపీ ఎంపీ కనకమేడల. చంద్రబాబు అరెస్ట్‌ను పిరికిపంద చర్యగానే చూస్తాం తప్ప చట్టబద్ధమైన చర్యగా చూడబోం అని తేల్చి చెప్పారు.ఇక అందరూ ఆసక్తిగా గమనించే అంశం.. దీనిపై పవన్ కల్యాణ్ ఏమంటారని. చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టారంటూ డైరెక్ట్ స్టేట్‌మెంట్ ఇచ్చారు జనసేన అధినేత. అసలు ప్రాథమిక ఆధారాలు లేకుండా ఎలా అరెస్ట్ చేస్తారనేది పవన్ కల్యాణ్ ప్రశ్న. చంద్రబాబు అరెస్ట్ ముమ్మాటికీ రాజకీయ కక్ష సాధింపేనని ముగింపు ఇచ్చారు.ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి అరెస్ట్ చేసిన తీరును మాత్రమే ఖండించారు. ఎఫ్ఐఆర్‌లో పేరు లేని వ్యక్తిని, కనీస వివరణ తీసుకోకుండా, ఓ నోటీసు ఇవ్వకుండా ఎలా అరెస్ట్ చేస్తారనేది పురంధేశ్వరి ప్రశ్న. స్కాం జరిగి ఉంటే.. నిబంధనల ప్రకారం చేసుకుంటూ వెళ్లాలనేది పురంధేశ్వరి వర్షన్. సీఐడీ కూడా ఈ కేసులో చంద్రబాబును నిందితుడేనని తేల్చి చెప్పింది. అటు నారా లోకేశ్ పాత్రపైనా విచారణ జరుగుతోందంటూ బాంబు పేల్చింది సీఐడీ.మొత్తానికి, నిజంగా స్కామ్ జరిగిందా లేదా అనే కంటే.. ఇది పొలిటికల్‌గా ఏ మలుపు తిరుగుతుందన్న దానిపైనే ఎక్కువ చర్చ జరుగుతోంది.

# మెదక్ భారమంత రఘునందుడిపైనే

**మెదక్, సెప్టెంబర్ 12:**

మెదక్ జిల్లాలో బీజేపీ పరిస్థితి అంతంతమాత్రమే అని విశ్లేషకులు అంటున్నారు. ఒక్క దుబ్బాక తప్ప మిగత నియోజకవర్గాల్లో పార్టీకి బలమైన నేతలే లేరని తెలుస్తోంది.సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్న దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గంలో తప్ప, పాత మెదక్ జిల్లాలోని మిగత 9 నియోజకవర్గాలలో ఎక్కడ కూడా బీజేపీకి బలమైన అభ్యర్థులు లేని పరిస్థితి. ఇన్నేళ్ళుగా ఏ నియోజకవర్గంలోనూ బలమైన క్యాడర్ ను నిర్మించుకోలేకపోవడమే దీనంతటికి కారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. క్యాడర్, లీడర్ లేని మెదక్ జిల్లా బీజేపీ మోదీ చరిష్మా, సోషల్ మీడియా, ప్రభుత్వ వ్యతిరేకత మీదే పూర్తిగా ఆధారపడింది. సంగారెడ్డి నియోజకవర్గం నుంచి రాజేశ్వరావు దేశ్ పాండే , శివరాజ్ పాటిల్ పార్టీ టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. కానీ ఇద్దరిలో ఎవ్వరు కూడా గట్టి పోటీనిచ్చే పరిస్థితిలో లేరని విశ్లేషకులు అంటున్నారు. పాండేకు, పాటిల్ కు సొంత క్యాడర్ లేదనేది అభిప్రాయం.పటాన్ చెరు నియోజవర్గంలో మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్, సి.అంజి రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, ఎడ్ల రమేష్ టికెట్ కోసం పోటీ పడుతున్నారు. కానీ ఇక్కడ పోటీ మాత్రం బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్న కాటా శ్రీనివాస్ గౌడ్ మధ్యలో మాత్రమే ఉంటుందని పటాన్ చెరు నాయకుల అభిప్రాయం. బీజేపీ నుంచి ఎవరు పోటీ చేసిన 2018 ఎన్నికలలో పార్టీకి వచ్చిన



మూడోస్థానం మెరుగుపర్చడం కష్టమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆందోల్ నుంచి మూడుమార్లు గెలిచి ఎమ్మెల్యే అయినా నటుడు పి.బాబు మోహన్ 2018లో బీజేపీలో చేరి పోటీ చేస్తే నిండ మూడు వేల ఓట్లు కూడా పొందలేదు. దీంతో ఈ నియోజకవర్గంలో బీజేపీ పరిస్థితి ఏంటో తెలుసుకోవచ్చు. నారాయణఖేడ్ నియోజవర్గం నుంచి బీజేపీ టికెట్ కోసం మాజీ ఎమ్మెల్యే విజయపాల్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ సంగప్ప పోటీ పడుతున్నారు. సంగప్ప తరుచుగా నియోజకవర్గంలో తిరుగుతుండగా, విజయపాల్ రెడ్డి పార్టీ కార్యకలాపాలకు పూర్తిగా దూరంగా ఉంటున్నారు. ఎవరు పోటీ చేసినా పార్టీకి ఇక్కడ విజయావకాశాలు పెద్దగా లేవని సమాచారం.జహీరాబాద్ నియోజవర్గంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దామోదర రాజనరసింహ సొంత తమ్ముడు రాంచందర్ బీజేపీలో జాయిన్ అయ్యారు. పార్టీ కూడా టికెట్ అతనికే ఇచ్చే అవకాశం ఉంది. 2018లో బీజేపీ టికెట్ పైన పోటీ చేసి సుమారుగా 20,000 ఓట్లు తెచ్చుకున్న జంగం గోపిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడం బీజేపీ పెద్ద నష్టంగా మారింది. సిద్దిపేట నియోజకవర్గంలో దూది శ్రీకాంత్ రెడ్డి, పార్టీ ప్రెసిడెంట్ నరోత్తం రెడ్డి బీజేపీ టికెట్ ఆశిస్తున్నారు, కానీ రాష్ట్రంలోనే అత్యున్నత మెజారిటీతో గెలిసిన మంత్రి హరీశ్ రావుకు వీరు ఏ మాత్రం పోటీ ఇవ్వగలరనేది పెద్ద ప్రశ్న. సీఎం పోటీ చేస్తున్నగజ్వేల్ నియోజకవర్గంలో బీజేపీ టికెట్ ని ఆశించే వాళ్లు కూడా పెద్దగా లేరంటే పార్టీ పరిస్థితి ఏ విధంగా ఉందో తెలుస్తోంది.ఇక దుబ్బాక నియోజకవర్గంలో గెలిసిన రఘునందన్ రావు పైనే బీజేపీ మొత్తం ఆశలు పెట్టుకుంది. కానీ ఈసారి మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ నేత కొత్త ప్రభాకర్ రెడ్డిని దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దింపడంతో ఫలితాలు తారుమారు అయ్యే అవకాశం ఉంది. నర్సాపూర్ బీఆర్ఎస్ నుంచి వెళ్లిన మురాలి యాదవ్, బీజేపీ సింగాయపల్లి గోపి టికెట్ కోసం ప్రయత్నం చేస్తున్నారు. కానీ బీజేపీకి ఇక్కడ క్యాడర్ లేకపోవటం, ఈ ఇద్దరు లీడర్ల మధ్య కూడా సఖ్యత లేకపోవటం పార్టీకి నష్టం జరిగే అవకాశం ఉంది. ఈసారి ఈటల రాజేందర్ సతీమణి జామున పోటీ చేసే అవకాశం కూడా ఉందని బీజేపీ నాయకులు అంటున్నారు. అలా జరిగితే, జమున తప్పకుండా పోటీ ఇచ్చే అవకాశం ఉంది. మెదక్ పార్టీ జిల్లా ప్రెసిడెంట్ గడ్డం శ్రీనివాస్ టికెట్ ను ఆశిస్తున్నారు. ఎన్నికల్లో అతని ప్రభావం అంతంత మాత్రమే అంటున్నారు.

# కాంగ్రెస్ గూటికి సీతాదయాకరరెడ్డి...

**మహబూబ్ నగర్, సెప్టెంబర్ 12:**

మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం గాంధీభవన్ కు వచ్చిన దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్ రెడ్డి.. తెలంగాణ వ్యవహారాల ఇంచార్జి మాణిక్ రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీతా దయాకర్ రెడ్డితో పాటు మరికొందరు నేతలు, ఆమె అనుచరులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు రేవంత్ రెడ్డి. దివంగత ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్ రెడ్డి భార్యనే ఈ సీతా దయాకర్ రెడ్డి. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర, మక్తల్, నారాయణపేట నియోజక వర్గాలకు చెందిన దయాకర్ రెడ్డి అనుచరులు, కుమారులు కొత్త కోట సిద్ధార్థ రెడ్డి, కార్తీక్ రెడ్డిలతో కలిసి గాంధీ భవన్‌కు వచ్చి ఆమె కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. దయాకర్ రెడ్డి కుటుంబానికి మక్తల్, దేవరకద్రల్లో పెద్ద ఎత్తున అభిమానులు, మద్దతుదారులు ఉన్నారు. భార్యాభర్తలు, సీతా దయాకర్ రెడ్డి, దయాకర్ రెడ్డిలు పలు ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీలో అసంతృప్తులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో రేవంత్ రెడ్డి ఆహ్వానం మేరకు సీతా దయాకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయం తీసుకున్నారు. కానీ ఆమెకు కాంగ్రెస్ టికెట్ ఇస్తుందా అనేది కష్టమే అన్న వాదన వినిపిస్తోంది .ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రాజకీయాల్లో దయాకర్ రెడ్డి దంపతులు కీలకంగా వ్యవహరించారు. అమరచింత నియోజకవర్గం నుంచి దయాకర్‌రెడ్డి 1994, 1999 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. నియోజక వర్గాల పునర్విభజనతో 2009లో మక్తల్ నుంచి గెలుపొందారు. దయాకర్ రెడ్డి భార్య సీతా దయాకర్ రెడ్డి 2002లో మహబూబ్ నగర్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. 2009లో కొత్తగా ఏర్పాటైన నియోజకవర్గం దేవరకద్ర నుంచి ఆమె ఎమ్మెల్యేగా గెలిచారు. 2009లో భార్యభర్తలు ఎమ్మెల్యేలుగా అసెంబ్లీలోకి అడుగుపెట్టి రికార్డు సృష్టించారు. 2018 ముందస్తు ఎన్నికల్లో మహా కూటమిలో భాగంగా మక్తల్ నుంచి



పోటీ చేసినా ఓటమి పాలయ్యారు. సుదీర్ఘకాలం దయాకర్ రెడ్డి దంపతులు టీడీపీలో కొనసాగారు. అయితే గత ఏడాది వీరు టీడీపీని వీడారు. టీడీపీతో తమకు ఉన్న అనుబంధం గుర్తు చేసుకుని మాజీ ఎమ్మెల్యేలు కొత్తకోట దయాకర్‌రెడ్డి, సీతా దయాకర్‌రెడ్డి కన్నీరు పెట్టుకున్నారు. తెలంగాణలో ఎన్నికలకు సమయం దగ్గర పడటంతో ఏదో ఓ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారు. మక్తల్, దేవరకద్ర రెండు నియోజకవర్గాల్లో దయాకర్ రెడ్డి దంపతులకు మంచి పట్టు ఉందని వారిని ప్రధాన పార్టీలు గతేడాది ఆహ్వానించారు. ఈ క్రమంలో ఈ ఏడాది జూన్ నెలలో దయాకర్ రెడ్డి కన్నుమూశారు. దయాకర్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు చంద్రబాబు.

## పక్కా ఆధారాలతోనే అరెస్టు-మంత్రి వనిత

**విశాఖపట్నం**
స్కిల్ డెవలప్మెంట్ కేసులో పక్కా ఆధారాలతోనే చంద్రబాబుకు రిమాం డు విధించారని, దీనిలో ఎటువంటి కక్షసాధింపు, దురుద్దేశం లేదని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత అన్నారు. విశాఖలోని హోటల్లో అధికారిక సదస్సుకు హాజరైన ఆమె ప్రత్యేకంగా విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లా డారు. చట్టం ఎవ్వరికీ అతీతం కాదని, అందరికీ సమానమేనని చెప్పారు. జైల్లో చంద్రబాబుకు ప్రాణహాని ఉందని చెప్పడం ఊహాజనితమన్నారు. అది సానుభూతి, రాజకీయ లబ్ధి కోసం చేసిన ఆరోపణలు మాత్రమేనని పేర్కొన్నారు. రాజమండ్రి జైలులో ఆయనకు అన్ని సదుపాయాలు, సెక్యూరిటీ ఉంటుందని తెలిపారు. టిడిపి పిలుపునిచ్చిన బంద్ ప్రభావం ఎక్కడా కనిపించలేదని చెప్పారు. దీనిని బట్టే చంద్రబాబుపై రాష్ట్ర ప్రజలకు ఉన్న సానుభూతి అర్థమవుతుందని తెలిపారు.

## కాంగ్రెస్ సభలో గందరగోళం

**ఖమ్మం**
ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ముఖ్య నాయకుల , కార్యకర్తల సమావేశం గందరగోళంలో కొనసాగింది. ఈ సమావేశానికి పార్టీ సీనియర్ నేత వి హనుమంతరావు, కేంద్ర మాజీ మంత్రి రేణుక చౌద, మాజీ ఎంపి రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, సంభాని చంద్ర శేఖర్ తదితరులు హజరయ్యారు. సమావేశం ప్రారంభం కాగానే అక్కడ గందరగోళం ఏర్పాడింది. కార్యకర్తలు ఒకరినొకరు పోటాపోటిగా నినాదాలు చేసారు. విహెచ్ విహెచ్ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. స్థానిక నాయకులు పేర్లు చెప్పలేదు అంటూ ఆగ్రహం వ్యక్తం చేసారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చివరకు కార్యకర్తలను శాంతింప చేసారు

## చంద్రబాబు అరెస్టు అన్యాయం

**ఏలూరు**
తెలుగు దేశం పార్టి అధినేత రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడు పై రాష్ట్ర ప్రభుత్వం అక్రమ కేసు బనాయించి అరెస్ట్ చేయించడం అన్యాయమని ఏలూరు జిల్లా తెలుగు దేశం పార్టి కార్యవర్గం ఆరోపించింది. ఏలూరు జిల్లా టి డి పి కార్యాలయం లో మంగళ వారం రాష్ట్ర టి డి పి నాయకత్వం పిలుపు మేరకు చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ పై జిల్లా పార్టీ నాయ కత్వం అవలంబించాల్సిన తక్షణ భవిష్యత్ కార్యా చరణ కార్యక్రమాల పై ఏలూరు పార్ల మెంట్ టి డి పి ఇన్ ఛార్జ్ గ న్నీ వీరాంజ నీయులు అధ్యక్షతన జిల్లా టి డి పి కార్య వర్గం చర్చించింది. ఈ సందర్భంగా ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జి గని వీరాంజనేయులు, మాజీమంత్రి కేఎస్ జవహర్, ఏలూరు నియోజవర్గ టిడిపి ఇన్చార్జి రాధాకృష్ణ లు మాట్లాడుతూ రాష్ట్రంలో మచ్చలేని నాయకుడైన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై అక్రమ కేసులు బనాయించారని దీని ప్రజలంతా గమనిస్తున్నారని రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు చంద్ర బాబు నాయుడు పై అధికార పార్టీ అవలంబిస్తున్న కక్ష సాధింపు చర్యలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని నాయకులు పిలుపునిచ్చారు రాష్ట్రంలోని కార్యకర్తలంతా చంద్రబాబు నాయుడు పై పెట్టిన అక్రమ కేసులను ప్రజలకు వివరించి మద్దతు తెలియజేసే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని అన్నారు ఈ సమావేశంలో జిల్లా నలుమూలల గ్రామాలనుంది టి డి పి నాయకులు.కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ కార్య క్రమం లో పాల్గొన్నారు.

## సీఎం జగన్ కు ఘన స్వాగతం

**గన్నవరం**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి లండన్ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చారు. ఇవాళ ఉదయం కృష్ణాజిల్లా గన్నవరం ఎయిర్పోర్ట్లో దిగిన సీఎం జగన్ దంపతులకు ఘన స్వాగతం లభించింది. సీఎం జగన్కు గన్నవరం ఎయిర్పోర్ట్ వద్ద సీఎస్, మంత్రులు, డీజీపీ ఘన స్వాగతం పలికారు. అనంతరం సీఎం జగన్ దంపతులు రోడ్డు మార్గంలో తాడేపల్లి నివాసానికి బయల్దేరిన క్రమంలో దారి పొడవునా ప్రజలు ఘన స్వాగతం పలికారు. సీఎం జగన్ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. ఈ నెల 2న ముఖ్యమంత్రి దంపతులు లండన్ వెళ్లిన సంగతి తెలిసిందే

# చంద్రబాబు అవినీతిపరుడు

### ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్



**విశాఖపట్నం**
చంద్రబాబు వందకు వందశాతం అవినీతి పనులు చేశాడు. చంద్రబాబును గాంధీ,అంబేద్కర్ తో పోల్చడం దారుణమని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. మంగళవారం నాడు అయన మీడియాతో మాట్లాడారు. ఆరవై లక్షల మంది పార్టీ కార్యకర్తలున్నారని అన్నారు. కనీసం ఆరు వందల మంది టిడిపి కార్యకర్తలు రోడ్లమీదకి రాలేదు. చంద్రబాబు విషయం కు బాగా తెలుసు. ఎందుకంటే చంద్రబాబు నా శిష్యుడు. జగన్ మోహన్ రెడ్డి రేపు డిల్లి వెళ్ళి ప్రధాని,అమిత్ షాను కలవనున్నారు. చంద్రబాబు,జగన్ మోహన్ రెడ్డి కేంద్రానికి తొత్తులు. పవన్ కళ్యాణ్ అయితే డాన్స్ లు వేస్తున్నాడు. చంద్రబాబు,జగన్ మోహన్ రెడ్డిపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని అన్నారు. చాలామంది వైసిపి ఎమ్మెల్యేలు మాతో టచ్ లో ఉన్నారు.జూనీయర్ ఎన్టీఆర్ తెలివైనవాడు.ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉన్నారు. చంద్రబాబును ఇప్పుడు ఎందుకు అరెస్ట్ చేశారో ప్రజలకు తెలుసు. బిజేపి వలన దేశం సర్వనాశనం అయిందని అయన అన్నారు..

# కేశినేని నాని యూ టర్న్...

**విజయవాడ, సెప్టెంబర్ 12:**

ఉమ్మడి కృష్ణా జిల్లాలో మంచి పలుకుబడి కలిగిన రాజకీయవేత్త అనడంలో సందేహం లేదు. మరీ ముఖ్యంగా బెజవాడ రాజకీయాలలో ఆయన ఆధిపత్యం తిరుగులేనిది. తాజాగా చంద్రబాబు అరెస్ట్ నేపధ్యంలో ఆయన వెనక్కే కనిపించారు. పార్టీలో పట్టు కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఆయన గత ఎన్నికలలో విజయవాడ నుంచి ఎంపీగా ఎన్నిక కావడమే అంటారు. విజయవాడ లోక్ సభ నియోజకవర్గ పరిధిలో అత్యధిక అసెంబ్లీ స్థానాలలో వైసీపీ విజయం సాధించినా.. లోక్ సభ సభ్యుడిగా కేశినేని నాని గెలవడమే బెజవాడలో ఆయనకు ఉన్న ఆదరణకు నిదర్శనంగా చెబుతారు.అటువంటి నాని ఇప్పుడు తన రాజకీయ భవిష్యత్ ఏం కాబోతోందన్న బెంగలో పడ్డారు. అసలు ఆయన రాజకీయాలలోకి రావడమే కాకతాళీయం అంటారు ఆయన ప్రస్థానం గురించి తెలిసిన వారు. అసలు నాని రాజకీయ నాయకుడు కాదు.. సినిమా హీరో కావాల్సిన వారు. తొలుత ఆయన తన భవిష్యత్ కు, ఎదుగుదలకు సినీ హీరోగా కెరీర్ ప్రారంభించాలని భావించారు. ఇందు కోసం ఆయన దర్శక రత్న దాసరి వద్దకు వెళ్లారు. దాసరి అప్పట్లో కొత్త నటీనటులతో ఓ సినిమా తీసే యోచనలో ఉన్నారు. అందులో ఇద్దరు హీరోలలో ఒకరిగా నానికి దాదాపు చాన్స్ ఇచ్చేశారు. అయితే అప్పట్లో కేశినేని నానితో పోటీ పడి చివరి నిముషంలో కేశినేని నాని అవకాశాన్ని తన్నుకు పోయిన వ్యక్తి కలెక్షన్ కింగ్ గా విలక్షణ నటుడిగా గుర్తింపు పొందిన మోహన్ బాబు. ఔను అప్పటిలో చివరి క్షణంలో సినీమా హీరోగా అవకాశం తప్పిపోవడంతో కేశినేని నాని ఇక సినిమాలకు గుడ్ బై చెప్పేసి వ్యాపార రంగంలో స్థిరపడ్డారు. కేశినేని ట్రావెల్స్ స్థాపించి రవాణా రంగంలో రాణించారు.అక్కడి నుంచి ఆయన తెలుగుదేశం పార్టీలో చేరి ఎంపీగా ఎదిగారు. ఇదంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే ఆయన కెరీర్ లో ఏరీ ఆయన చాయిస్ కాదు.. చాన్స్ అంతే.



రాజకీయంగా తన ఎదుగుదలకు దోహదపడిన తెలుగుదేశంతో గత కొంత కాలంగా ఆయన అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. 2019 ఎన్నికలలో తెలుగుదేశం పరాజయం పాలై విపక్ష పాత్రకు పరిమితమైన నాటి నుంచీ అధికార వైసీపీతో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నట్లుగా నాని తీరు ఉంది. పార్టీలోని కొందరు నాయకులతో తన కున్న విభేదాలను అడ్డుపెట్టుకుని తన స్థాయిని మరిచి మరీ సొంత పార్టీ తెలుగుదేశంపై, ఆ పార్టీ అధినాయకత్వంపై విమర్శలు గుప్పించి ఉద్దేశపూర్వకంగా పార్టీకి దూరం అవుతున్న సంకేతాలు ఇచ్చారు. అధికార వైసీపీ కేశినేని నాని అదే సమయంలో అధికార వైసీపీ నేతలపై పొగడ్తల వర్షం కురిపించి ఇక తెలుగుదేశం పార్టీ కూడా తనను లెక్కలోంచి తీసేసే పరిస్థితిని స్వయంగా తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలోనే కేశినేని నాని వైసీపీ గూటికి చేరే అవకాశాలున్నాయని పరిశీలకులు పలు సందర్భాలలో విశ్లేషించారు. తెలుగుదేశం పార్టీ కూడా అదే నిర్ణయానికి వచ్చేసి కేశినేని నాని స్థానంలో ఆయన సోదరుడు కేశినేని చిన్నిని ప్రోత్సహించడం ప్రారంభించింది. వచ్చే ఎన్నికలలో విజయవాడ లోకసభ స్థానం నుంచి కేశినేని చిన్నిని పార్టీ అభ్యర్థిగా నిలపాలన్న నిర్ణయానికి వచ్చేసింది. దీంతో బెజవాడ బరి అన్నదమ్ముల సవాల్ గా మారనున్నదన్న భావన సర్వత్రా కలిగింది. అయితే వైసీపీ పట్ల పెల్లుబుకుతున్న ప్రజా వ్యతిరేకతను గమనించారో ఏమో కానీ కేశినేని నాని తన ప్రయాణం తెలుగుదేశంతోనే అని పదే పదే చెబుతూ పార్టీ అధిష్ఠానం మెప్పు పొందాలన్న ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన పదే పదే తాను విజయవాడ లోక్ సభ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా రానున్న ఎన్నికలలో నిలబడతానని చెబుతున్నారు. అదే సమయంలో పార్టీ అధినేత చంద్రబాబును పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. హస్తినలో ఆయనకు షేక్ హ్యాండ్ ఇచ్చేందుకు కూడా నిరాకరించిన సంగతిని మరిచిపోయి ఆయన వంటి దార్శనికుడు, నిజాయితీ పరుడు లేడంటూ కీర్తిస్తున్నారు. తాజాగా కంచికచర్లలోని ఏకత్వ ఇంటర్నేషనల్ స్కూల్ భూమి పూజ కు హాజరైన కేశినేని నాని మరోసారి చంద్రబాబుపై ప్రశంసల వర్షం కురిపించారు. దేశ రాజకీయాల్లోనే చంద్రబాబు వంటి నిజాయితీ పరుడు లేడన్నారు. నాలుగు దశాబ్దాల రాజకీయాలలో మచ్చ లేని వ్యక్తిగా చంద్రబాబుది స్వచ్ఛమైన వ్యక్తిత్వమన్నారు.ఇంతకీ అంత చేసిన కేశినేని నాని ఇప్పుడు ప్లేట్ ఫిరాయించి తెలుగుదేశం విశ్వాసాన్ని పొందగలరా అన్న అనుమానాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తం అవుతున్నాయి. చంద్రబాబు కు ఐటీ నోటీసులపై స్పందించిన కేశినేని నాని నోటీసులు పెద్ద విషయం కాదన్నారు. వివరణ ఇస్తే సరిపోతుందనీ దానిపై అనవసర ఊహాగానాలు వ్యర్థమని వైసీపీకి చురకలంటించారు. అక్కడితో ఆగకుండా తాను తెలుగుదేశంలోనే ఉన్నాననీ, ఉంటాననీ చెబుతూ వచ్చే ఎన్నికలలో విజయవాడ నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా తానే బరిలో ఉంటానన్నారు. ఇక ఏపీలో పొత్తులపై చర్చ గురించి మాట్లాడుతూ పొత్తుల విషయం పూర్తిగా తెలుగుదేశం అధిష్ఠానం నిర్ణయమేననీ, పార్టీ ఏ నిర్ణయం తీసుకుంటే క్యాడర్ అంతా దానికి కట్టుబడి ఉంటుందన్నారు. తాను తెలుగుదేశం పార్టీకి దూరం అవుతున్నానంటూ వస్తున్న వార్తలన్నీ అసత్యాలనీ, తాను పార్టీలోనే పార్టీతోనే ఉంటానని స్పష్టం చేశారు.

# విరిగిపడుతున్న కొండ చరియలు

**విజయవాడ, సెప్టెంబర్ 12:**

విజయవాడ ఇంద్రకీలాద్రిపై భారీ కొండ చరియలు విరిగి పడ్డాయి. కేశఖండనశాల సమీపంలో కొండ చరియలు ఒక్కసారిగా కూలిపోయాయి.జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రెండేళ్ళ క్రితం దేవస్థానం సత్రాన్ని తొలగించి విస్తరణ చేపట్టారు. కృష్ణానదికి, ఇంద్రకీలాద్రికి మధ్య ఉన్న రోడ్డు మార్గాన్ని విస్తరించారు. గతంలో ఈ ప్రాంతంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఉండేది. ఫ్లైఓవర్ నిర్మాణంతో దానిని తొలగించారు. భక్తుల రాకపోకల కోసం, కృష్ణానది దుర్గాఘాట్‌కు చేరుకునేందుకు అండర్ పాస్ నిర్మించారు. కేశఖండన శాలను అనుకుని ఉన్న కొండ చరియలు కొంత కాలంగా ప్రమాదకరంగా ఉన్నాయి. గతంలో కొండ చరియల్ని తొలగించి అవి కింద పడకుండా రాక్ ర్యాప్టింగ్ చేపట్టారు. పనులు లోపభూయిష్టంగా నిర్వహించడంతో కొన్నేళ్లకే మళ్లీ కొండ చరియలు ప్రమాదకరంగా తయారయ్యాయి. తాజా ఘటనలో భారీ కొండ చరియలు విరిగి రోడ్డుపై పడిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. కుమ్మరిపాలెం నుంచి కెనాల్ రోడ్డులోకి వచ్చే వాహనాలను నిలిపివేశారు. కొండ చరియల్ని తొలగించడానికి మరికొంత సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు.ఈ ఘటనలో ఎవరికి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇంద్రకీలాద్రిపై కొలువైన అమ్మవారి దర్శనాలకు వచ్చే భక్తులతో సాధారణంగా ఈ మార్గం రద్దీగా ఉంటుంది. అమ్మవారికి మొక్కులు చెల్లింపులో భాగంగా కేశఖండన శాలకు వచ్చి, ఆ తర్వాత నదీ స్నానాలకు వెళుతుంటారు. రద్దీగా ఉండే ప్రదేశంలో కొండ చరియలు విరిగిపడటంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం రాత్రి విజయవాడలో భారీ వర్షం కురవడంతో కొండ చరియల్లో వర్షపు నీరు చేరి రాళ్లు కిందకు జారిపోయి ఉంటాయని భావిస్తున్నారు.

# ఖైదీల సంక్షేమం, పునరావాసానికి పెద్ద పీట

**విశాఖపట్నం**

జైళ్ల పాలనలో రాష్ట్రాలు మానవతా దృష్టితో ఉండాలని కేంద్ర హోం మంత్రి త్వ శాఖ సహాయమంత్రి అజయ్ కుమార్ మిశ్రా కోరారు. రెండ్రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి మేథోమథనం విశాఖలో ప్రారంభమైంది. దేశంలో వివిధ రాష్ట్రాల్లో ఉన్న అన్ని రకాల జైళ్లలో ప్రస్తుత పరిస్థితులు ఎలా ఉన్నాయి? 2047 సంవత్సరానికి వీటిని ఏ రకంగా పురోగతిలోకి తీసుకురావచ్చు.. 75 ఏళ్ల స్వతంత్ర్య భారతదేశంలో జైళ్లలో ఖైదీల సంక్షే మం, సంస్కరణలపై ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని మంత్రి అజరుకుమార్ మిశ్రా ప్రారంభించి మాట్లాడారు. జైళ్ల పరిస్థితులను మెరుగుపరిచే టెక్నాలజీ విషయంలో పురోగతి సాధించాలన్నారు. నేరాలను నిరోధించేలా ఖైదీల్లో డి ఎడిక్షన్ కార్య కలాపాలను పెంచాలని, ముఖ్యంగా వారిలో మానసిక ఆరోగ్యం పెంచేం దుకు తగిన కృషిని రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాలని సూచించారు. 2023 న్యూ మోడల్ ప్రిజన్, సేవలు, అత్యధికంగా జైళ్లలోకి కుక్కబడుతున్న ఖైదీల విషయాలపై సమగ్రంగా రెండ్రోజుల పాటు చర్చించాలన్నారు. ఎపిలో ఈ మేథోమదనం ఇది రెండోసారి జరుగు తోందని వివరించారు. రాష్ట్రంలో జైళ్ల కండిషన్స్ను మెరుగుపరచడంలో ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి కృషి చేస్తున్నా రన్నారు. రాష్ట్రంలోని జైళ్లలో పేదలైన ఖైదీలకు వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత కార్పొరేట్ వైద్య సదుపాయం అమలు చేస్తున్నామని, మౌలిక వసతుల కల్పనపై ఎప్పటిక ప్పుడు సమీక్షిస్తున్నామని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత తెలిపారు. శుద్ధ మైన మంచి నీరు, కరెంట్, పౌష్టికాహా రం, రిక్రియేషన్ కల్పిస్తున్నట్లు వివరిం చారు. ఖైదీలలో నైపుణ్యా లను వెలికి తీసేందుకు స్కిల్ డెవలప్మెంట్ శిక్షణను జైళ్లలో పెట్టామని, వారి ఉత్పత్తులను అమ్మేందుకు స్టాల్స్ ఏర్పాటు చేశామని వివరించారు. ఖైదీలకు చేయూత నిధిని, కార్పస్ ఫండ్ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.దేశ వ్యాప్తంగా 12 రాష్ట్రాల నుంచి 99 మంది, కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాల ఐజి, డిఐజిలు, సూపరిండెంట్లు హాజరయ్యారు.

# స్టీల్ ప్లాంట్ లో ప్రైవేట్ ఆక్సిజన్

**విశాఖపట్టణం,సెప్టెంబర్ 12:**

విశాఖపట్టణం ఉక్కులోని ఆక్సిజన్ ప్లాంట్‌పై ప్రైవేట్ సంస్థల కన్ను పడింది. ఉక్కు ఉత్పత్తికి ఐరన్ ఓర్, బొగ్గు, విద్యుత్ ఎంత అవసరమో ఆక్సిజన్ కూడా అంతే అవసరం. అటువంటి ఆక్సిజన్ ప్లాంట్‌ను ప్రయివేటీకరించడం ద్వారా కేంద్రంలోని పాలకులు విశాఖ ఉక్కు ఊపిరిని తీసెయ్యాలని స్కెచ్ వేశారు. నెలల తరబడి కోల్, ఐరన్ ఓర్ రాకుండా కేంద్రం ఇప్పటికే అడ్డుపడుతోంది. ఆక్సిజన్ ప్లాంట్ కోసం ఓ ప్రయివేట్ సంస్థ ప్లాంట్‌లో తిష్ట వేసే ఏర్పాట్లు చేస్తుండడంతో విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికవర్గం మరోసారి భగ్గుమంటోంది. 'ఆక్సిజన్ ప్లాంట్ లేకుండా చేస్తే ఉక్కు ఊపిరి పోయినట్టే. ఈ కుట్రలను తిప్పికొడతాం' అని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ జె.అయోధ్యరాం తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్లాంట్‌లో చాలా కాలం నుంచి ఆక్సిజన్ సెపరేషన్ యూనిట్లు మూడు ఉన్నాయి. రోజుకు ఒక్కో యూనిట్ నుంచి 500 టన్నుల చొప్పున మూడింటి నుంచి 1500 టన్నులు ఉత్పత్తి అవుతోంది. ప్లాంట్ విస్తరణలో భాగంగా మరో రెండు యూనిట్ల నిర్మాణం చేశారు. అవి ఒక్కొక్కటీ 600 టన్నుల చొప్పున 1,200 టన్నులు ఆక్సిజన్ ఉత్పత్తి చేస్తున్నాయి. మొత్తం కలిపి విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో 2700 టన్నులు రోజుకు ఉత్పత్తి జరుగుతోంది. దీన్ని ఎస్ఎంఎస్, బ్లాస్ట్ ఫర్నేస్‌ల డిపార్టుమెంట్లలో వాడుతున్నారు. ప్లాంట్ విస్తరణలో మరింత ఆక్సిజన్ అవసరమైనందున 2010లో ఫ్రెంచ్‌కు చెందిన ఎయిర్ లిక్విడ్ కంపెనీతో 1,700 టన్నుల ఆక్సిజన్ తయారీకి ఒప్పందం జరిగింది. ఆ ప్లాంట్ నిర్మాణం పూర్తయి 2014లో ట్రయల్ రన్‌కు రాగా, ఒక పెద్ద కంపెనీలో మరో పెద్ద కంపెనీ వచ్చి ప్లాంట్ కడితే ఆ ప్లాంట్‌కు ఎలా లైసెన్సు ఇస్తారంటూ అప్పటి టిడిపి ప్రభుత్వం, అధికార పార్టీ పెద్దలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో లైసెన్స్ ఆగిపోయింది. ఆక్సిజన్ సరిపడా లేకుండా స్టీల్‌ప్లాంట్ ముందుకుపోయే అవకాశం లేనందున ఆ మొత్తం యూనిట్‌ను స్టీల్‌ప్లాంట్‌కు ఇవ్వాలని ఫ్రెంచ్ కంపెనీని కోరగా, రూ.1000 కోట్లు ఇస్తే కంపెనీ మొత్తాన్ని హేండోవర్ చేస్తామంటూ స్టీల్‌ప్లాంట్‌కు ఆ కంపెనీ చెప్పింది. 2014-15లో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం రూ.250 కోట్లు ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. కానీ, ఎయిర్ లిక్విడ్ కంపెనీ, స్టీల్‌ప్లాంట్ మధ్య సరైన అవగాహన లేనందున ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్‌కు ఈ విషయం వెళ్లింది. పదేళ్లపాటు దీనిపై ఎలాంటి నిర్ణయమూ జరగలేదు. తాజాగా దీనిపై ఫ్రెంచ్ కంపెనీ తరుపున ప్రముఖ న్యాయవాది హరీష్ సాల్వే, వైజాగ్ స్టీల్ తరుపున ఓ మాజీ జడ్జి వాదనలు వినిపించినట్లు తెలుస్తోంది. ఎయిర్ లిక్విడ్ కంపెనీకి రూ.389 కోట్లు చెల్లించి ఆ కంపెనీని ఆపరేట్ చేసుకోవచ్చని ఆర్బిట్రేషన్‌లో చెప్పగా, వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఇప్పటికే రూ.80 కోట్లు చెల్లించింది.పదేళ్లపాటు మూలనపెట్టిన ఎక్విప్‌మెంట్ తుప్పుపట్టిన కారణంగా తాజాగా లైసెన్స్ తీసుకుని వివిధ పద్ధతుల్లో వీటన్నిటినీ సరిచేసేందుకు స్టీల్‌ప్లాంట్ సిద్ధమైంది. తొమ్మిది నెలల క్రితమే పైనతెలిపిన రూ.80 కోట్లను రెండు దఫాలుగా ప్లాంట్ చెల్లించింది. మిగిలిన రూ.300 కోట్లను బ్యాంకు ద్వారా తీసుకొచ్చి ఎయిర్ లిక్విడ్ కంపెనీకి స్టీల్‌ప్లాంట్ ఇచ్చేస్తే యుటిలిటీస్ డిపార్టుమెంట్‌గా పిలవ బడేటు వంటి నెంబరు 2 డిపార్టుమెంట్ అంతా స్టీల్‌ప్లాంట్ పరమవుతుంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పెద్దలు దీన్ని మీరు నడపలేరని, వేరే వాళ్లకి ఇచ్చేసి అక్కడ నుంచి ఆక్సిజన్ తీసుకోవాలని మెలిక పెట్టారు. దీంతో, ప్లాంట్ ఉన్నతాధికారులు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తీవ్ర ఆందోళనకు గురవ తున్నారు.

# బావిలోపడి ముగ్గురు కుటుంబసభ్యులు మృతి

**విజయనగరం**

విజయనగరం జిల్లా కొత్తవలస మండలం చింతలపాలెం గ్రామంలో దారుణం చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు బావిలో పడి మృతి చెందారు. వారు బావిలో ఎప్పుడు దూకారనేది తెలియకపోయి నప్ప టికీ... మృతదేహాలు బయటకు తేలడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ముఖ్యంగా దంపతుల మృతదేహాలు నీటిలో పైకి తేలాయి. అయితే స్థానిక ప్రజలు విషయం గుర్తించి పోలీసులకు తెలపగా.. హుటాహుటిన వారు రంగంలోకి దిగారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అయితే 46 ఏళ్ల మహముద్దీన్, అతడి భార్య 39 ఏళ్ల షరీష నిషా మృతదేహాలు బావిలో తేలగా.. బయటకు తీశారు. లోపల మరో మృతదేహం



ఉన్నప్పటికీ.. దాన్ని బయటకు తీయలేరు. అయితే ఆమె వీరి కూతురు 18 ఏళ్ల ఫాతిమా జహారగా పోలీసులు గుర్తించారు. అయితే చింతలపాలెం గ్రామ పొలాల వద్దకు క్యాబ్ లో వచ్చిన ఈ ముగ్గురు మృతులు... ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తమ 19 ఏళ్ల కుమారుడు అలీకి తెలిపారు. ఫోన్ చేసి విషయం చెప్పి లొకేషన్ కూడా పెట్టి మరీ బావిలో దూకినట్లు తెలుస్తోంది. అలాగే కొత్త వలస సీఐ చంద్రశేఖర్ వివరాలు సేకరిస్తున్నారు. ఇక ఈ సంఘటన పై ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

# ఏప్రిల్, మే నెలలోనే తెలంగాణ ఎన్నికలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 12**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు డిసెంబర్ లో జరగడం అనుమానమేనని మంత్రి కేటీఆర్ మీడియా ప్రతినిధుల చిట్ చాట్ లో వ్యాఖ్యానించారు. వచ్చే నెల పదో తేదీ లోపు ఎన్నికల నోటిఫికేషన్ వస్తే డిసెంబర్ లో జరుగుతాయని లేకపోతే పార్లమెంట్ తో పాటు మార్చి, ఏప్రిల్ లో జరుగుతాయన్నారు. ఏదైనా పార్లమెంట్ సమావేశాల్లో స్పష్టత వస్తుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎన్నికలకు భయపడుతున్నారని కేటీఆర్ అన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రభావం పార్లమెంట్ ఎన్నికలపై ఉంటుందనుకుంటున్నారని అందుకే జమిలీ ఎన్నికల పేరుతో ఆలస్యం చేయాలనుకుంటున్నారని కేటీ?ర్ అభిప్రాయం వ్యక్తం చేశారు.ఇటీవలి కాలంలో జమిలీ ఎన్నికలపై విస్తృత చర్చ జరుగుతోంది. కేంద్రం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహిస్తోంది. మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నేతృత్వంలో కమిటీని కూడా నియమించారు. ఆ కమిటీ విస్తృత సంప్రదింపులు జరుపుతోంది. కానీ కమిటీ ఎప్పటిలోపు నివేదిక ఇస్తుందో స్పష్టత లేదు. ముందస్తు ఎన్నికలు జరగబోవని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ స్పష్టం చేశారు. పార్లమెంట్ కు ముందస్తు ఎన్నికలు జరగకపోతే.. ఐదు రాష్ట్రాల ఎన్నికలను వాయిదా వేసేలా రాజ్యాంగ సవరణ చేస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కేటీఆర్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో జమిలీ ఎన్నికల బిల్లు పెడతారా లేదా అన్నదానిపై స్పష్టత లేదు. కానీ.. పెట్టే అవకాశాలు ఉన్నాయని ఎక్కువ మంది నమ్ముతున్నారు. కోవింద్ కమిటీ ఎప్పుడైనా నివేదిక ఇవ్వవొచ్చని అంటున్నారు. జమిలీ ఎన్నికలు పెట్టాలంటే.. ఐదు రకాల రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంటుందని .. ఇప్పటికే కేంద్రం పార్లమెంట్ లో తెలిపింది. అందుకే ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారని అంటున్నారు. ఇప్పటి వరకూ పార్లమెంట్ సమావేశాల ఎజెండాను కేంద్రం ప్రకటించలేదు. రెండు, మూడు రోజుల్లో దీనిపై ప్రకటన చేసే అవకాశం ఉంది. ఇండియా అనే పేరును భారత్ గా మార్చడంతో పాటు పలు కీలక అంశాలపై బిల్లులు పెట్టబోతున్నారన్న చర్చ జరుగుతోంది. ఈ చర్చను కేంద్రం ఇలా సాగనిస్తోంది కానీ... ఎన్నికలపై క్లారిటీ ఇవ్వడం లేదు. తెలంగాణ ప్రభుత్వ పదవీ కాలం జనవరితో ముగిసిపోతుంది. ఆ తర్వాత ఆపద్ధర్మంగా కూడా కొనసాగే అవకాశం ఉండదు. ఎందుకంటే ఎన్నికలు జరగలేదు కాబట్టి.. ప్రజా ప్రతినిదులే ఉండరు. రాష్ట్రపతి పాలన విధించాల్సి వస్తుంది. కనీసం ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉన్నా... అధికారంలో ఉన్నట్లుగా ఉంటుంది కానీ.. రాష్ట్రపతి పాలనలో అంతా గవర్నర్ చూసుకుంటారు. ఇక్కడే కీలక పరిణామాలకు కారణం అయ్యే అవకాశం ఉంది. బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో జరిగిన చిట్‌చాట్‌లో మంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. మరికొన్ని నెలల్లో తెలంగాణలో ఎన్నికలు రానున్నాయని భావిస్తున్న సమయంలో మంత్రి చేసిన వ్యాఖ్యలు కొత్త చర్చకు దారి తీశాయి. ఇదిలా ఉంటే షెడ్యూల్ ప్రకారం చూస్తే అక్టోబర్ 10వ తేదీని నాటికి తెలంగాణ ఎన్నికలకు నోటిఫికేషన్ రావాల్సి ఉంది. ఒకవేళ అనుకున్న సమయానికి ఎన్నికల నోటిఫికేషన్ వస్తే.. తెలంగాణలో ఈ ఏడాది డిసెంబర్‌లో ఎన్నికలు జరుగుతాయి. అలా కాకుండా మంత్రి కేటీఆర్ చెప్పినట్లుగా జరిగితే మాత్రం ఏప్రిల్ లేదా మే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి.

# 3 నుంచి ఎన్నికల కమిటీ పర్యటన

**హైదరాబాద్, సెప్టెంబర్ 12**

తెలంగాణలో మరికొన్ని నెలల్లో శాసన సభ ఎన్నికలు రాబోతున్న విషయం అందరికీ తెలిసిందే. అయితే ఈ ఎన్నికల నిర్వహణకు వేగంగా సన్నాహాలు సాగుతున్నాయి. ఎన్నికల ప్రణాళికకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం.. ఇప్పటికే రాష్ట్ర అధికారులకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఈక్రమంలోనే ఏర్పాట్లను సమీక్షించేందుకు వచ్చే నెల మూడో తేదీ నుంచి 5వ తేదీ వరకు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉంది. త్వరలోనే పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండడంతో.. కమిషనర్ రాజీవ్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు ఆయా రాష్ట్రాల్లో ఏర్పాట్లను సమీక్షించనున్నారు. ఇందులో భాగంగానే సీఈసీ.. తెలంగాణలో తాత్కాలిక పర్యటన తేదీలను రాష్ట్ర అధికారులకు పంపింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో.. రాష్ట్ర అధికారులు ఓటర్ల జాబితా నుంచి పోలింగ్ కేంద్రాలు, పోలీసు బందోబస్తు, బోగస్ ఓటర్ల ఏరివేత, ఎన్నికల నిర్వహమ ఏర్పాట్లు తదితర సమాచారాన్ని రూపొందిస్తున్నారు.రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్ రాజ్ కూడా అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ.. దిశానిర్దేశం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులు ఎన్నికల ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నారు. అలాగే 2012కు ముందు ఏపీ సిరీస్ తో 13 నుంచి 14 అంకెలతో ఉన్న ఓటరు గుర్తింపు కార్డులను అధికారులు గుర్తించారు. దేశవ్యాప్తంగా ఓటరు కార్డు సంఖ్య 10 అంకెలకు తగ్గించింది. రాష్ట్రంలోని 47 లక్షల 22 వేల 763 మంది ఓటర్ల కార్డు నంబర్లు మారాయి. వారికి నూతన ఫొటో ఓటరు కార్డులు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుని కొత్త కార్డులను పొందవచ్చని తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ తెలిపారు. అయితే ఇప్పటికే రాష్ట్రంలో కొంతమంది కొత్త ఓటరు కార్డులు పొందారు. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణపై ఈసీ పర్యటన ముగిసిన తర్వాత ఢిల్లీలో ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహి స్తుంది. సానుకూల పరిస్థితులు ఉన్నాయని ఏకాభిప్రాయానికి వచ్చిన తర్వాత ఎన్నికల షెడ్యూల్ విడుదలపై నిర్ణయం తీసుకుం టుందట.నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణల కొరకు వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి అన్నారు.

# బెజవాడలో మైండ్ కంట్రోల్ టెక్నాలజీ...

**విజయవాడ, సెప్టెంబర్ 12:**

మైండ్ కంట్రోల్ టెక్నాలజీ గురించి మీకు తెలుసా? చాలా తక్కువ మందికి తెలుసు.. కానీ అమెరికాలో దీని బాధితులు ఎక్కువమందే ఉన్నారట.. పూర్వకాలం చేతబడి విద్య అనేది ఉండేది.. తాము ఎవరినైతే టార్గెట్ చేసేవారో.. ఆ వ్యక్తి తాలూకు వెంట్రుకలను తీసుకొని పిండి బొమ్మను తాయారు చేసి అందులోకి పంపి చంపాలనుకున్న వ్యక్తిని ఆవాహన చేసుకొని ఆ బొమ్మను హింసిస్తూ ఉంటె ఆ మనిషి హింసకు గురిఅవుతాడు అనేది కొందరి నమ్మకం.. అయితే మైండ్ కంట్రోల్ టెక్నాలజీ చేసేది కూడా ఇలాంటిదే.. ఎవరినైతే కంట్రోల్ చేయాలనుకుంటున్నారో వారిని టెక్నాలజీ ద్వారా తీసుకొని వారు ఏం ఆలోచిస్తున్నారో ఈ టెక్నాలజీ ద్వారా తెలుసుకుంటున్నారట.మానవ మెదడును కంట్రోల్ చేసే టెక్నాలజీ పరిశోధనలతో ప్రమాదం పొంచి ఉంటుందని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, ఎన్నారై తరుణ్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మానవుల ఆలోచనలను చదివి మానవ మెదడులను ప్రభావితం చేసే టెక్నాలజీనీ కొన్ని గుర్తు తెలియని సంస్థలు అభివృద్ధి చేసి మనుషులను గిన్ని పిగ్స్ వలె ఉపయోగించుకుంటున్నారని ఔఖీఎ రావి తరుణ్ ఆరోపించారు. అయితే.. వినటానికి కాస్త విచిత్రంగా ఉన్నా ఇది వాస్తవమని అన్నారు తరుణ్. మనుషుల ఆలోచనలను చదివటం దగ్గర నుంచి మానవుల ఆలోచనలను దారి మళ్ళించే విధంగా పరిశోధనలు చేస్తూ గిన్ని పిగ్స్ గా వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనలాగే వైజాగ్ లో ఓ వ్యక్తిని టార్గెట్ చేశారని దీంతో అతను ఆ భాదలు భరించలేక అమెరికా వదిలి వైజాగ్ వచ్చేశారని తెలిపారు. మూడు నెలల క్రితం హవానా సింట్రోమ్ వివరాలు తెలపాలంటూ కర్ణాటక హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసిందని అన్నారు.ఉదాహరణకు ఏదైనా ప్యాంట్, షర్టు గురించి గూగుల్ లో వెతికితే వెంటనే దానికి సంబంధించిన వివరాలు మొత్తం మొబైల్లో ప్రత్యక్షమవుతాయని అంతేకాకుండా అనేక కంపెనీల నుంచి తమ ప్రోడక్ట్ కొనమంటూ మెసేజ్ లు వస్తాయని ఆ విషయాలు ఆయా కంపెనీలకు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. అంటే.. మన డీటెయిల్స్ ని మనం వెతికిన సంస్థ లేదా ఆ సాఫ్ట్‌వేర్ ఫలానా వ్యక్తి షర్టు, ప్యాంట్లు కావాలని అడుగుతున్నారని మిగిలిన కంపెనీలకు పంపిస్తాయని అన్నారు. అంటే మన వివరాలను అమ్మేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు తరుణ్.. ఈ టెక్నాలజీని అభివృద్ధి చేసిన సైంటిస్టులు బహిరంగంగా చేసిన పరిశోధనల పట్ల విచారణ వ్యక్తం చేస్తున్నారని అన్నారు. 1953లో అమెరికా ఎంకే ఆల్ట్రా పేరుతో ఈ ప్రాజెక్ట్ కు శ్రీకారం చుట్టారని ఆ పరిశోధనల ఫలితమే ఈ న్యూరో వెపన్స్, ఎనర్జీ వెపన్స్ అని అన్నారు.ఈ వెపన్స్ మానవ మెదళ్లను ప్రభావితం చేస్తాయని తద్వారా ఆలోచనలను తెలుసుకొనటమే కాకుండా మనిషిలో అనేక రకమైన బాధలను కలిగిస్తాయని, దీనినే హావానా సింట్రోం అంటారని చెప్తున్నారు.. హావాన సింట్రోం బారిన పడిన వారిలో అనేకమంది ప్రఖ్యాతి చెందిన సైంటిస్టులు డాక్టర్లు సాఫ్టేర్ ఇంజనీర్లు ఉన్నారని వారిలో అమెరికాకు చెందిన ప్రముఖ రాజకీయవేత కమల్ హారిస్ ఉన్నారని, డాక్టర్ లెన్ బెర్, డాక్టర్ రాబర్ట్ డంకన్, డాక్టర్ కేథరీన్ హోర్టన్, డాక్టర్ జాన్ హాల్ ఉన్నరని అన్నారు. నిద్ర లేకపోవడం రిమోట్ థాట్ రీడింగ్ ప్రసారం, మసక దృష్టి, డ్రీమ్ మానిప్యులేషన్, మూడ్ మార్పు మైక్రోవేవ్ వాయిస్ టూ స్కల్ ? మెదడులోకి ఎలక్ట్రానిక్‌గా బేసి శబ్దాల ప్రొజెక్షన్ చేస్తారని వివరించారు.అంతేకాక.. మనుషులు మెదళ్లను కంట్రోల్ చేసి.. బ్యాంక్ పాస్ వర్డ్ రీడ్ చేయడం, మర్చిపోయాలా చేస్తారని అన్నారు. తక్షణమే ప్రభుత్వాలు కలుగజేసుకొని మానవ మెదడుపై పరిశోధనలకు అడ్డుకట్ట వేయాలని లేనిపక్షంలో భవిష్యత్తరాలకు తీరం నష్టమే జరగటమే కాకుండా కార్పొరేట్ శక్తులకు బానిసలుగా మారే అవకాశం ఉందని అన్నారు. కాబట్టి భారత ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన హవానా సింట్రోంపై దృష్టి సారించాలని సాఫ్ట్ వేర్ ఉద్యోగి తరుణ్ కోరుతున్నారు..

# ఉరేసుకునే ఆట ఆడాడు-ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడు

**తిరుపతి, సెప్టెంబర్ 12**

ఈ మధ్య కాలంలో ప్రతీ ఒక్క పిల్లాడు ఫోన్ తోనే ఉంటున్నాడు. ఫోన్ లో బొమ్మలు చూపిస్తేనే అన్నం తింటున్నారు. అల్లరి చేయకుండా కూర్చుంటున్నారు. ఆ తల్లిదండ్రులు కూడా బాలుడికి కార్టూన్లు చూడడం అలవాటు చేశారు. అయితే బాలుడు అందులో చేస్తున్న మాదిరిగానే చేయడం వంటివి చేసేవాడు. అదే అతని పాలిట శాపంగా మారింది. బాలుడు ప్రాణాలు కోల్పోయేలా చేసింది. చిత్తూరు జిల్లా కైలాసపురం కస్తూరీ నగర్ లో విషాధం జరిగింది. మూడో తరగతి చదువుతున్న ఎనిమిదేళ్ల సూర్య అనే బాలుడు... ఇంట్లో ఆడుకుంటున్నాడు. కిటీకీ పైనున్న ఎలక్ట్రిక్ పైపుకు తాడును కట్టాడు. ఆపై దాన్ని మెడకు తగిలించుకొని ఆడుకున్నాడు. తల్లిదండ్రులు తమ పనుల్లో బిజీగా ఉండి.. బాలుడిని గమనించలేదు. ఇంతలోనే ఆ తాడు బాలుడి మెడకు బిగుసుకొని ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడు. విషయం గుర్తించిన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూనే.. పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన రంగంలోకి దిగిన పోలీసులు.. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈక్రమంలోనే బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయితే బాలుడు ఆడుకుంటూనే ప్రాణాలు కోల్పోయాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. బాలుడు ఎక్కువగా కార్టూన్లు చూస్తాడని, అందులో చూపించినట్లుగా చేస్తాడని అంటున్నారు. గతంలో కూడా ఓసారి ఇలాగే మంచానికి తాడు కట్టి మెడకు చుట్టుకున్నాడని.. కానీ విషయం గుర్తించిన తాను తాడు విప్పి బాబును మందలించినట్లు బాలుడి తండ్రి చెబుతున్నాడు. చనిపోయే ఆట ఆడుకుంటానంటూ బాబు తరచుగా తల్లితో చెప్పాడని, దానికా తాను బాలుడిని తీవ్రంగా మందలించి కొట్టినట్లు ఆమె తల్లి చెప్పింది. కానీ అదే ఆటతో బాబు ప్రాణాలు కోల్పోతాడని ఎప్పుడూ అనుకోలేదని విలపిస్తోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల పట్టణంలో ఇటీవలే దారుణం చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన 11 ఏళ్ల ఉదయ్ కుమార్ అనే బాలుడు ఆరో తరగతి చదువుతున్నాడు. అయితే బాలుడికి తల్లిదండ్రుల సెల్ ఫోన్ లో వీడియోలు చూసే అలవాటు ఉంది. రోజూలాగే ఆ రోజు రాత్రిపూట భోజనం చేశాడు. అనంతరం ఫోన్ తీసుకొని ఓ గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. విషయం గుర్తించని తల్లిదండ్రులు భోజనం చేసి ఇతర పనులు చేసుకున్నారు. బాలుడు చాలా సేపు అవుతున్నా బయటకు రాకపోవడంతో.. తల్లిదండ్రులు చాలా సేపు పిలిచారు. అయినప్పటికీ చడీచప్పుడు లేకపోవడంతో తలుపులు పగులగొట్టారు. అప్పటికే ఉదయ్ ఉరి వేసుకొని ఫ్యాన్ కు వేలాడుతూ కనిపించాడు. అది చూసిన తల్లిదండ్రులకు అసలు ఏం జరిగిందో అర్థం కాలేదు. గట్టిగా కేకలు వేస్తూ ఏడ్వడంతో స్థానికులంతా వచ్చారు. తలుపులు పగులగొట్టి బాలుడిని నేరుగా ఆస్పత్రికి తరలించారు.మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా... అప్పటికే అతడు చనిపోయినట్లు వైద్యులు వెల్లడించారు. అలాగే స్థానికులు పోలీసులకు కూడా సమాచారం అందించగా.. హుటాహుటాన రంగంలోకి దిగారు. పోస్టుమార్టం నిమిత్తం ఉదయ్ మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# చవితి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

**పత్తికొండ**

ఈ ఏడాది వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావర ణంలో జరుపుకోవాలని ఆర్డీవో మోహన్ దాస్ అన్నారు పట్టణంలోని ఆర్డిఓ ఆఫీస్ లో పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన శాంతి సమా వేశానికి ఆయన ముఖ్య అతిథిగా పత్తికొండ డి.ఎస్.పి శ్రీనివాసులు రెడ్డి,హాజరై మాట్లాడా రు. శాంతికి మారుపేరు పత్తికొండ అని ఏ పండగ జరిగిన శాంతియుతంగా జరుపుకొంటారని అన్నారు. ఈ ఏడాది కూడా వినాయక చవితి ఉత్సవాలు అం గరంగ వైభవంగా నిర్వహించి ఎలాంటి గొడవలకు ఆస్కారం ఇవ్వొద్దని సూచించారు. అదేవిధంగా రోడ్లపై ఏర్పాటు చేయకుండా వాహనాలు వెళ్లే విధంగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసులకు సహకరిం చాలని సూచించారు. సీఐ మురళీమోహన్ మాట్లా డుతూ వినాయక మండపాలు వద్ద ఏమి జరిగినా నిర్వాహకులదే బాధ్యతని అన్నారు. డీజేలకు సంబర దించి ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో వివరిస్తామని తెలిపారు. తాసిల్దార్ విష్ణు ప్రసాద్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మండపాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. విద్యుత్ ప్ర మాదాలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని సూచిం చారు. సమావేశంలో తుగ్గలి ,మద్దికేర ,జొన్నగిరి ,దేవనకొండ ,పత్తికొండ ,ఎస్సైలు పాల్గొన్నారు ఎంపీడీవో కవిత, విద్యుత్ శాఖ ఏఈ, ఫైర్ ఎస్ ఐ వివిధ కుల సంఘాల పెద్దలు, హిందూ వాహిని సభ్యులు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహ కులు తదితరులు పాల్గొన్నారు.

# హౌరా ఎక్స్ ప్రెస్ రైలులో పొగలు

**వరంగల్**

హైదరాబాద్ నుంచి విజయవాడ మీదుగా హౌరా వెళుతున్న హౌరా ఎక్స్ ప్రెస్ రైలులో పొగలు వచ్చాయి.వరంగల్ జిల్లా నెక్కొండ దగ్గర రైలును నిలిపివేశారు డ్రైవర్లు. రైలులో పొగలు రావటాన్ని గమనించిన ప్రయాణికులు.. చెయిన్ లాగి రైలును ఆపారు. అప్పటికే పెద్ద ఎత్తున పొగలు.. బోగీలను కమ్మేశాయి. రైలు అయితే నెక్కొండ సమీపంలో.. రైల్వే స్టేషన్ల మధ్య నిర్మానుష్య ప్రాంతంలో ఆగిపోయింది.రైలులో పొగలు రావటాన్ని గమనించిన ప్రయాణికులు.. చెయిన్ లాగి రైలును ఆపేశారు. రైలు నుంచి దిగి పరుగులు తీశారు. భయాందోళనలకు గురైన ప్రయాణికులు.. రైల్లో నుంచి దిగి పరుగులు తీయటంతో గందరగోళం ఏర్పడింది. రైలులోని డ్రైవర్లు, గార్డు పరిస్థితిని సమీక్షించి.. రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చారు.రైలు బ్రేక్ లైనర్లు పట్టేయటంతో పొగలు వచ్చాయని.. ఎలాంటి ప్రమాదం లేదని ప్రయాణికులు వివరించారు. బ్రేక్స్ సరి చేస్తే సరిపోతుందని వివరించారు.

# చార్మినార్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ టికెట్ కై కె.వెంకటేష్ దరఖాస్తు

**హైదరాబాద్ సెప్టెంబర్ 12**

రాబోయే శాసనసభ ఎన్నికల్లో చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు తనకు టిక్కెట్టును కేటాయించాలని కోరుతూ చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కె.వెంకటేష్ శుక్రవారం గాంధీభవన్ లో దరఖాస్తును సమర్పించారు. అంతకు ముందు చారిత్రాత్మక లాల్ దర్వాజా సింహవాహిని శ్రీ మహంకాళి దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గాంధీభవన్ కు వెళ్లి తన దరఖాస్తును టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేష్ కుమార్ గౌడ్ కు కార్యాలయంలో అల్లం భాస్కర్ లకు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుండి పార్టీకి విధేయునిగా అంకితభావంతో కట్టుబడిగా పనిచేస్తున్నానని పేర్కొన్నారు. 2014 లో జరిగిన సాధారణ ఎన్నికల్లో పార్టీ తనకు చార్మినార్ నుండి పోటీ చేసే అవకాశం కల్పించిందని అనంతరం గత పది సంవత్సరాలుగా నియోజకవర్గంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పార్టీ ఆదేశాల అనుగుణంగా ప్రజల పక్షాన అనేక సార్లు నిరస,ధర్నా,రాస్తారోకోలు, పోరాటాలు చేపట్టి అరెస్టులు అయిన సందర్భాలు ఉన్నాయని అన్నారు.

# అందరికీ అన్నం పెట్టాలనేది టీడీపీ లక్ష్యం

**తాడేపల్లిగూడెం**



పేదలందరికీ పట్టెడన్నం పెట్టాలనె లక్ష్యంతో నాడు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావించిందని తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు పట్నాల రాంపండు అన్నారు . నియోజకవర్గ ఇన్చార్జ వలవల మల్లికార్జున రావు ఆధ్వర్యంలో జరుగుతున్న 57 వారం అన్న క్యాంటీన్ వద్ద ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.. ఈ కార్యక్రమాన్ని పట్టణ అధ్యక్షులు పట్నల రాంపండు ప్రారంభించారు. తెలుగుదేశం నాయకులు దాట్ల బాలాజీ కుమారుడు చిరంజీవి పార్థ పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంపండు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అన్నా క్యాంటీన్లు ఎత్తివేయడం వలన ఎంతోమంది పాదచారులు, కూలి పనుల కోసం పట్టణాలకు వలస వచ్చిన వారు, అర్ధ ఆకలితో అలమరిస్తున్నారనీ అన్నారు. అందరికీ అన్నం పెట్టాలని ఆలోచనతో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు ప్రతి మంగళవారం పట్టణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. తిరుమల లారీ అసోసియేషన్ అధ్యక్షులు దొడ్ల బాలాజీని టిడిపి నేతలు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కిలపర్తి వెంకట్రావు, వాడపల్లి సుబ్బరాజు, ఆకాశపు స్వామి, బండి పెద్దిరాజు, మునగపాటి పరుశు రాం, ముప్పిడి రమేష్, చెప్పుల వాసు, ముత్యాల శ్రీనివాసరావు, పసలపూడి రాంబాబు, షేక్ బాజీ, కిలాడి సాయి, సంతోష్ రావు, కే రామకృష్ణ, వీర శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# వేడుకగా కోయిల్ ఆల్వార్ తిరుమంజనం

**తిరుమల**



తిరుమల శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆల్వార్ తిరుమంజనం వేడుకగా జరిగింది. సెప్టెంబరు 18 నుండి 26వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆల యం అంతటా శాస్త్రోక్తంగా ఆలయ శుద్ధి నిర్వహించారు అర్చకులు, సిబ్బంది. ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వ హించారు అర్చకులు. ఆనందనిల యం, బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రం చేశారు. ఈ సమయంలో స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచారు. ఆలయ శుద్ధి అనంతరం సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు.

# కడియద్ద మాజీ ఎంపీటీసీ తోట యువరాజు కన్నుమూత

**తాడేపల్లిగూడెం**

తాడేపల్లిగూడెం రూరల్ మండలం కడియద్ద మాజీ ఎంపీటీసీ మెంబర్, మాజీ ఉపసర్పంచ్, వైకాపా సీనియర్ నాయకులు తోట యువరాజు (85) మంగళవారం తెల్లవారుజామున కన్ను మూశారు. గత కొంతకాలంగా అస్వస్థతకు గురైన ఆయన కడియద్ద లోని నివాసంలో తుది శ్వాస విడిచారు. యువరాజు గతంలో కడియద్ద ఎంపీటీసీగా, గ్రామ ఉపసర్పంచ్ గా పదవులు నిర్వహించారు. కడియద్ద గ్రామం అభివృద్ధికి తన వంతు కృషి చేశారు. స్వతహాగా కాంగ్రెస్ వాది అయిన యువరాజు గత మూడు దశాబ్దాలుగా మండలం తో పాటు గ్రామ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు. స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి (దేవదాయ ధర్మాదాయ శాఖ) కొట్టు సత్యనారాయణకు అనుచరుడిగా గుర్తింపు పొందారు. తోట యువరాజుకు భార్య శిరోమణి, కుమారుడు కృష్ణమూర్తి, కుమార్తె ధనలక్ష్మి సంతానం. కడియద్ద మాజీ ఎంపీటీసీ, మాజీ ఉప సర్పంచ్, వైకాపా సీనియర్ నాయకులు తోట యువరాజు మృతి పట్ల స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి (దేవాదాయ ధర్మాదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పార్టీ పట్ల ఎంతో అంకితభావం, నిబద్ధతతో యువరాజు కృషి చేసేవారు అన్నారు. ఆయన మరణం తనకు వ్యక్తిగతంగా తీరని లోటు అన్నారు. కడియద్ద గ్రామం తో పాటు పార్టీ మంచి నాయకుడిని కోల్పోయింది అన్నారు. యువరాజు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.తండ్రి లాంటి వాడిని కోల్పోయా : ముప్పిడి సంపత్.తోట యువరాజు మరణంతో తండ్రి లాంటి వాడిని కోల్పోయానని మాజీ జడ్పిటిసి, తాడేపల్లిగూడెం మండలం గ్రామ సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. యువరాజు మరణ వార్త తెలియగానే కడియద్ద గ్రామానికి వెళ్లి యువరాజు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. యువరాజు ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఓదార్పు ను ఇవ్వాలని భగవంతుని ప్రార్థించారు. 1995లో తాను ఎంపీపీగా ఉండగా యువరాజు ఎంపీటీసీగా ఉండేవారని, తనకు తండ్రిలా ఎన్నో సలహాలు, సూచనలు ఇచ్చి మంచి మార్గంలో నడిపించే వారని గుర్తు చేసుకున్నారు. మంచి ఆహార్యంతో పెద్దరికానికి యువరాజు నిలువెత్తు నిదర్శనంగా ఉండేవారు అన్నారు. ఆయన మరణం తమకు ఎంతో తీరని లోటు అని నివాళులు అర్పించారు. పలువురునివాళులు తోట యువరాజు మృతదేహాన్ని సందర్శించి పలువురు నివాళులర్పించారు. కడియద్ద గ్రామ మాజీ సర్పంచ్ పరిమి వెంకటేశ్వరరావు, గ్రామ వైకాపా నాయకులు యాతం భూరయ్య, పాకనాటి తాతాజీ, దారపురెడ్డి శ్రీనివాస్, గట్టిం సాంబయ్య, ఇంకా పలువురు గ్రామస్తులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

# గిరిజనులకు అండగా సీఎం జగన్

**- మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్**

**సారవకోట,**

గిరిజనులకు అండగా వైఎస్ జగన్మోహనరెడ్డి నిలుస్తున్నారని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మంగళవారం గుమ్మపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్యాతిథిగా పాల్గొన్నారు. ఈ గ్రామమ్నో ఉన్న గిరిజనులను కలవడం చాలా ఆనందంగా ఉందని ధర్మాన కృష్ణదాస్ పేర్కొన్నారు. వీరికి రహదారి సరిగా లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి సీఎం అయిన తరువాత రహదారి సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. అలాగే విద్యుత్ సమస్య ఉందని తనకు తెలియజేశారని, సింహాద్రి అప్పన్న ఆలయం కావాలని కోరారు. వాటిని అతిత్వరలోనే నిర్మాణం చేపడుతామన్నారు. జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తరువాత గిరిజనులకు అధిక ప్రాధాన్యనిస్తున్నారని దీనికి నిదర్శనం గిరిజన వ్యక్తికే ఉప ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టిన గొప్ప నాయకుడు జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఆయన హయాంలో తాను ఎమ్మెల్యే ఉండడం నా అదృష్టమని కృష్ణదాస్ పేర్కొన్నారు. గిరిజనులు అడిగిన సమస్యలన్నీ దశలవారీగా పరిష్కరించి వైసీపీ పార్టీ పట్ల గిరిజనులకు మరింత అభిమానం కల్పించి, ముఖ్యమంత్రికి అండగా ఉండే విధంగా అందరం కలిసి పనిచేద్దామని అన్నారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# మేయర్ వర్సెస్ జనసేన

**గుంటూరు, సెప్టెంబర్ 12**

గుంటూరు రాజకీయాలు మిర్చి కన్నా ఘాటు అన్నట్టుగా సాగుతున్నాయి. మేయర్ చేసిన వ్యాఖ్యల చుట్టూ రాజకీయ దుమారం చెలరేగుతోంది. నిన్న బంద్ సందర్భంగా మేయర్ మనోహర్.. పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని మండిపడుతోంది జనసేన. ఈ వ్యాఖ్యలకు నిరసనగా.. ఇవాళ మేయర్ ఆఫీస్ ముట్టడికి జనసేన పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో జనసేన నేతలను ముందస్తు అరెస్ట్ చేశారు పోలీసులు. దీంతో ఎస్పీని కలిసిన జనసేన నేతలు.. ఫిర్యాదు చేశారు. మేయర్ కావటి మనోహర్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి వినతి చేశారు. అలాగే అరెస్ట్ చేసిన జనసేన నేతలను విడిచిపెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇక మేయర్ క్షమాపణ చెప్పకపోతే కార్యాచరణ ప్రకటిస్తామని జనసేన నేతలు హెచ్చరించారు. మరోవైపు ఎట్టిపరిస్థితుల్లో పవన్‌కి క్షమాపణ చెప్పేది లేదంటున్నారు మేయర్ కావటి మనోహర్. తమ పార్టీ అధినేతనూ, కార్యకర్తలనూ పవన్ గతంలో ఎన్నోసార్లు దూషించారని.. ఆయన క్షమాపణ చెప్తేనే తానూ చెప్తా అంటున్నారు. కాగా చంద్రబాబు నాయుడుకు రిమాండ్‌కు నిరసనగా బంద్ పాటిస్తూ షాపులు బంద్ చేయించారు టీడీపీ, జనసేన నాయకులు. అయితే అరండల్ పేటలో బంద్ చేసిన దుకాణాలు తెరిపించే ప్రయత్నం చేశారు మేయర్ కావటి మనోహర్. దీంతో జనసేన కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మేయర్‌ను అడ్డుకునే ప్రయత్నం చేశారు. రెండు పార్టీల నేతలు బాహాబాహీగా తలపడడంతో అరండల్‌పేట్‌లో ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి.

ప్రజా తపన
prajathapana.com
News that matters

బుధవారం 13 సెప్టెంబర్ 2023

## సిద్దిపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**సిద్దిపేట**
సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు (మం) అనంతసాగర్ గ్రామ శివారులో ఆగి ఉన్న ఇసుక లారీని క్వాలిస్ వాహనం వెనకాల నుండి ఢీకొంది. మంగళవారం జరిగిన ఈ ఘటనలో స్పాట్ లోనే ముగ్గురు మృతి చెందారు.మరో ఎనిమిది మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతులంతా సిద్దిపేటలోని ఇందూరు ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులుగా గుర్తించారు. పాలిటెక్నిక్ ఎగ్జామ్ రాయడానికి క్వాలిస్ వాహనంలో పదకొండు మంది కరీంనగర్ కు వెళ్లారు. ఎగ్జామ్ రాసి తిరిగి వస్తుండగా అనంతసాగర్ వద్ద ఆగి ఉన్న లారీని క్వాలీస్ ఢీ కొట్టింది.

## హైకోర్టుకు టీడీపీ

**విజయవాడ, సెప్టెంబర్ 12**
స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టై జైల్లో ఉన్న చంద్రబాబు హైకోర్టును ఆశ్రయించారు. ఆయనకు ఏసీబీ కోర్టు విధించిన రిమాండ్‌పై పిటిషన్ దాఖలు చేశారు. ఆయన తరఫున న్యాయవాదులు ఈ పిటిషన్ ఫైల్ చేశారు. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో కూడా ముందస్తు బెయిల్ పిటిషన్ వేశారు. ఈ కేసులో ఆయన్ని ఏ-1గా చూపించింది సిఐడీ. ఇప్పటికే దీనిపై పీటీ వారెంట్ వేసిన సీఐడీ... చంద్రబాబును విచారించేందుకు అనుమతి తీసుకుంది. ఆయనకు స్కిల్స్ డెవలప్‌మెంట్ కేసులో బెయిల్ వస్తే అమరావతి కేసులో అరెస్టు చేయడానికి ప్రయత్నాలు చేస్తోంది.

## ఆత్యాచారం చేసాడు..న్యాయం చేయాలి

### ఏఎస్పిని ఆశ్రయించిన బాధితురాలు

**పల్నాడు**
పల్నాడు జిల్లా ఎఎస్పీని కలిసి నరసరావుపేటకి చెందిన పావులూరి నాగలక్ష్మి అనే మహిళ పిర్యాదు చేసింది. ఈ నెల 4న చరిష్మా ఫైనాన్స్ అధినేత నరేంద్ర కుమార్ అనే వ్యక్తి తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని పిర్యాదులో పేర్కొంది. నరసరావుపేట టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేయడం లేదని మహిళ నాగలక్ష్మి ఆరోపించింది. కేసుని రాజీ చేసుకోవాలని నరసరావుపేట టూ టౌన్ సిఐ వీరేంద్ర ఒత్తిడి తెస్తున్నారని మహిళ ఆరోపించింది. న్యాయం చేయాలని ఎఎస్పీని బాధితురాలు ఆశ్రయించింది.

## చంద్రబాబు అరెస్టు ను ఖండించిన వైకాపా ఎమ్మెల్యే శ్రీదేవి

**గుంటూరు**
చంద్రబాబు నాయుడు అరెస్టుని వైసీపీ రెబల్ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి తీవ్రం గా ఖండించారు.చంద్రబాబును అరెస్ట్ చేసి ఏదో ఫ్యాక్షనిస్టు, నేరగాడిలా అరెస్టు చేసి తరలించారని అక్రమంగా పెట్టిన ఈ కేసు నుంచి చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకొస్తారని అన్నారు. ఇటువంటి అరెస్టులకు చంద్రబాబు బెదిరే వ్యక్తి కాదని రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తారని అన్నారు. గుంటూరు జిల్లా టిడిపి కార్యాలయానికి వచ్చిన తాడికొండ వైసీపీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి చంద్రబాబుని అరెస్టు చేసిన విధానం సరిగా లేదన్నారు.

## విపక్షాలపై అక్రమ కేసులు

**మదనపల్లె**
వైసిపి అధికారంలోకి వచ్చాక పోలీసులను అడ్డు పెట్టుకొని ప్రతిపక్ష నాయకుల పై అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని జనసేన పార్టీ రాయలసీమ కో కన్వీనర్ గంగారపు రామదాసు చౌదరి పేర్కొన్నారు. నేడు మదనపల్లె పట్టణంలోని నిమ్మనపల్లె సర్కిల్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం,రూరల్ మండలం అధ్యక్షులు గ్రానైట్ బాబు,ఐటీ విభాగ నాయకులు జగదీష్, కుమార్, నవాజ్,నారాయణ స్వామి, జనర్దన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామదాసు చౌదరి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి అరెస్టును తమ అధినేత పవన్ కళ్యాణ్ ఖండించి నారాలోకేష్ కు అండగా నిలిచారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని ఓడించి వారికి తగిన గుణపాఠం చెబుతామని స్పష్టం చేశారు.

## ఆ కామెంట్స్ ఆవాస్తావాలు-మంత్రి కేటీఆర్

**హైదరాబాద్**
తెలంగాణలో ముందస్తు ఎన్నికలు జరుగుతాయనే ఉహాగానలపై మంత్రి కేటీఆర్ స్పష్టతనిచ్చారు. తెలంగాణలో ఎన్నికలు మే లో జరగవచ్చు అంటూ తెలంగాణ ఎన్నికలపై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేసీఆర్ చేసిన కామెంట్స్ గా కొన్ని మీడియా ఛానళ్లు ప్రచారం చేస్తున్నాయి. అలాంటి ప్రస్తావన ఏమాత్రం రాలేదు. దయచేసి ఆవాస్తావలను ప్రచారం చేయవద్దని అయన కోరారు.

## బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం..

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. రాబోయే 3 రోజుల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. దీని ప్రభావంతో.. ఈ నెల 15 వరకు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు..గుంటూరు, బాపట్ల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్..పార్వతీపురం, అల్లూరి, ప్రకాశం, తూర్పు గోదావరి, ఏలూరు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని..మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచించారు.

# 15న బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం

**హైదరాబాద్, సెప్టెంబర్ 12**

భారత్ రాష్ట్ర సమితి పార్లమెంటరీ పార్టీ సమావేశం ఈ నెల 15 న ప్రగతి భవన్‌లో నిర్వహించనున్నారు . సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో.. పార్లమెంట్ ప్రత్యేక సెషన్స్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చలు జరపనున్నారు గులాబీ నేతలు. పార్టీకి చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులందరూ ఈ సమావేశానికి తప్పకుండా హాజరుకావాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు 5 రోజుల పాటు నిర్వహించనున్నారు. వర్షాకాల సమావేశాలు ముగిసిన అనంతరం నవంబర్ మూడో వారం ముగిసిన తర్వాత శీతాకాల సమావేశాలు నిర్వహించడం ఆనవాయితీ. అయితే ఈ వర్షకాల సమావేశాలు ఆగస్టు 11న ముగిసాయి. అయితే ఇవి ముగిసిన 40 రోజుల్లోపే ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయడం రాజకీయంగా చర్చనీయం అవుతోంది.అసలు ఈ సమావేశాలను ఎందుకు ముందుగానే జరుపుతున్నారనే విషయంపై కేంద్ర ప్రభుత్వం ఇంకా స్పందించలేదు. దీంతో వివిధ వర్గాలు భిన్న అంచనాలు వేస్తున్నాయి. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించి ఎన్నికలు నిర్వహించేందుకు పార్లమెంటును సమావేశపరుస్తున్నారని మరికొందరు భావిస్తున్నారు. అలాగే ఎన్నికలకు ముందు ఉమ్మడి పౌరస్మృతి అమలు, ఓబీసీ వర్గీకరణకు జస్టిస్ రోహిణి కమిషన్ చేసిన సిఫార్సుల ఆమోదం వంటివి చర్చించేందుకే అని పలువురు చెబుతున్నారు. అలాగే ఈ సమావేశాల్లో వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లును కేంద్రం తీసుకురానుందని ఇటీవల జోరుగా ప్రచారాలు సాగాయి. వాస్తవానికి శాసనసభ, స్థానిక సంస్థల ఎన్నికలను కలిపి నిర్వహించేందుకు రాజ్యాంగంలో అయిదు ఆర్టికల్స్‌ను సవరించాల్సి ఉంటుంది. అలాగే రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయం కూడా సాధించాల్సి ఉంటుంది.అలాగే అన్ని రాష్ట్ర ప్రభుత్వాల అంగీకారం తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే ఎన్నికలకు అదనంగా ఈవీఎంలు, వీవీప్యాట్‌లు సేకరించాల్సి ఉంటుంది. అలాగే వీటన్నింటిపైన నిర్ణయ తీసుకునేందుకే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ముందుగా నిర్వహించనున్నారున్న ఊహాగాణాలు ఉన్నాయి. అయితే ఈ సమావేశాలను పార్లమెంట్ నూతన భవనంలో నిర్వహించే అవకాశం ఉంది. ఇదిల ఉండగా ఈ ఏడాది చివర్లో.. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మిజోరం రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. అలాగే వచ్చే ఏడాదిలో అరుణాచల్ ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, సిక్కిం, హర్యాణా రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఓ వైపు జమిలి ఎన్నికలు నిర్వహిస్తారని కొందరు నేతలు చెబుతుండగా.. మరికొందరు నేతలు వాటిని ఖండిస్తున్నారు. దీంతో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఎలాంటి ప్రతిపాదనలు చేయనున్నారనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. అయితే ఏం జరగనుందో తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

# ర్యాగింగ్‌పై గాంధీ మెడికల్ కాలేజీ సీరియస్

**హైదరాబాద్, సెప్టెంబర్ 12**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ర్యాగింగ్ భూతానికి ఇప్పటికే పలువుర3ు మెడికల్ స్టూడెంట్లు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ కొన్ని వైద్యా కాలేజీల్లో ర్యాగింగ్ సంస్కృతి ఇప్పటికీ నివురు గప్పిన నిప్పులా కొనసాగుతూనే ఉంది. తాజాగా నగరంలోని ఓ మెడికల్ కాలేజీలో జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేసినందుకు గాను పది మంది ఎంబీబీఎస్ విద్యార్థులను ఆ మెడికల్ కాలేజీ అధికారులు సస్పెండ్ చేశారు. వివరాల్లోకెళ్తే..హైదరాబాద్‌లోని గాంధీ మెడికల్ కాలేజీకి ఎంతో ప్రతిష్ట ఉంది. అక్కడ చదువుకున్న ఎందరో విద్యార్థులు వైద్యులుగా దేశ వ్యాప్తంగా పలు చోట్ల విధులు నిర్వహిస్తున్నారు. ఇంతటి ప్రతిష్టాత్మక మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ వ్యవస్థ ఉండటం సిగ్గుచేటు. అక్కడ జూనియర్ విద్యార్థులను సీనియర్లు ర్యాగింగ్ చేయడం పరిపాటై పోయింది. తాజాగా మరోమారు గాంధీ మెడికల్ కాలేజీలో ర్యాంగింగ్ కలకలం సృష్టించింది. ఈ నేపథ్యంలో ర్యాగింగ్ నిరోధక కమిటీ విచారణలో సీనియర్ ఎంబీబీఎస్ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడినట్లు తేలడంతో పది మంది విద్యార్థులను సస్పెండ్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (ఆఓఇ) డిఆర్ కె రమేష్ రెడ్డి మీడియాకు తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ తన నిర్ణయం గురించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (జఉఅ), నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు తెలియజేసింది.తమపై ర్యాంగింగ్‌కు పాల్పడినట్లు 2023 బ్యాచ్‌కు చెందిన జూనియర్ విద్యార్థులు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగు చూసింది. దీంతో 2021 బ్యాచ్‌కు చెందిన ఐదుగురు ఎంబీబీఎస్ విద్యార్థులు, 2022 బ్యాచ్‌కి చెందిన మరో ఐదుగురు విద్యార్థులను సస్పెండ్ చేశారు. ర్యాగింగ్ ద్వారా తమను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నట్లు ర్యాగింగ్‌కు గురైన విద్యార్థులు తెలిపారు. ఈ ఘటన నెల రోజుల క్రితం జరిగినప్పటికీ సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ, ప్రయివేటు మెడికల్ కాలేజీల్లో ర్యాగింగ్‌కు పాల్పడితే సహించేది లేదని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మెడికల్ కాలేజీ డీఎంఈ రమేష్‌రెడ్డి హెచ్చరించారు. ర్యాగింగ్ నిరోధక చట్టాల ప్రకారం ర్యాగింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని నేషనల్ మెడికల్ కౌన్సిల్ దేశవ్యాప్తంగా ఉన్న అన్ని మెడికల్ కాలేజీలకు ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే.

# వైద్య కళాశాలల్లోని సీట్లలో 85 శాతం కన్వీనర్ కోటా

**హైదరాబాద్, సెప్టెంబర్ 12**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అవతరణ తర్వాత ఏర్పాటైన 34 వైద్య కళాశాలల్లోని సీట్లలో 85 శాతం కన్వీనర్ కోటా సీట్లు రాష్ట్ర విద్యార్థులకే వర్తింస్తాయని హైకోర్టు స్పష్టం సోమవారం రోజున చేసింది. అఖిల భారత కోటా 15 శాతంలో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు అవకాశం ఉంటుందని పేర్కొంది. రాష్ట్ర విభజన అనంతరం ఏర్పాటైన కళాశాలల్లో సీట్లన్ని తెలంగాణ విద్యార్థులకే కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జులై 3వ తేదీన తీసుకొచ్చిన జీవో 72ను సమర్థించింది. మరోవైపు ఈ జీవో 72ను సవాల్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు 60కి పైగా పిటీషన్లు దాఖలు చేశారు. అయితే పిటీషన్లను కొట్టివేస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ ఆరాధే, జస్టీస్ ఎన్.వి శ్రవణ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. అలాగే వైద్య ప్రవేశాలకు సంబంధించిన 2017 నిబంధనలను సవరించే అధికారం.. తెలంగాణ ప్రభుత్వానికి ఉంటుందని ధర్మాసనం తెలిపింది.అయితే ఈ నిబంధనలు కేవలం పార్లమెంట్ మాత్రమే సవరించాలని.. శాసనసభకు అధికారం ఉండదని చెప్పడం కేవలం అపోహ మాత్రమేనని తెలిపింది. ఇక సవరించిన నిబంధనల ప్రకారం చూసుకుంటే 85 శాతం కాంపిటెంట్ అథారిటీ సీట్లను స్థానికులకు వర్తింప జేయడం రాష్ట్రపతి ఉత్తర్వుల్లోని 5,6 పేరాల ప్రకారం విరుద్ధమేమి కాదని పేర్కొంది. అలాగే రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 95 ప్రకారం? ఆంధ్ర, తెలంగాణల్లో ఉన్నటువంటి అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్, మెడికల్ విద్యా కోర్సుల్లో పదేళ్లపాటు ఇరురాష్ట్రాలకు అవకాశం కల్పించాలని ఉంది. అయితే ఇది.. 2014 జూన్ 2 నాటికి ఉన్న అడ్మిషన్ కోటా ప్రకారమేనని తెలిపింది. కానీ 2014 జూన్ 2 తర్వాత ఏర్పాటు అయిన విద్యా సంస్థలకు ఈ సెక్షన్ వర్తించదని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశాల నిబంధనలను సవరించినటువంటి నేపథ్యంలో సెక్షన్ 95 కింద ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు ఎలాంటి చట్టపరమైన హక్కును పొందలేరని చెప్పింది.చట్టాలకు విరుద్ధంగా చట్టబద్ధమైన హక్కులను పొందాల నుకోరాదని చెప్పింది. ఇక మార్చి 6న నీట్ నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత జూన్ 3న నిబంధనలకు సవరణ తీసుకువస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడం అనేది ఆట మొదలయ్యాక నిబంధనలు మార్చడం ఏంటి అన్న వాదనపై కూడా ధర్మాసనం స్పందిస్తూ.. పిటిషనర్లు దీన్ని తప్పుగా అర్థం చేసుకున్నట్లు చెప్పింది. ఇక మెడికల్ అడ్మిషన్ల నిమిత్తం కాళోజీ వర్సిటీ జూన్ 6న నోటిఫికేషన్ విడుదల చేసిందని.. అంటే అడ్మిషన్ల ప్రక్రియ మొదలుకాకమునుపే నిబంధనల సవరణ జరిగిందని స్పష్టం చేసింది. 100 శాతం రిజర్వేషన్ చెల్లదంటూ గతంలో ఇచ్చిన సుప్రీం కోర్టు తీర్పు వాస్తవానికి ఉద్యోగాలకు సంబంధించినదని.. విద్యాసంస్థల్లో అడ్మిషన్లకు వర్తించవని పేర్కొంది. అలాగే మెడికల్ అడ్మిషన్లలో కూడా 100 శాతం రిజర్వేషన్లు లేవని.. 15 శాతంలో ఆలిండియా కోటాలో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు కూడా పోటీ పడొచ్చని స్పష్టం చేసింది.

# చంద్ర బాబు అరెస్ట్ అణిచి వేత లో భాగమే- జనసేన నేత తాతారావు

తాము అధికారం లోకి వచ్చాక వైసీపీ ఐదేళ్ల పాలన పై విచారణ చేస్తాము జన సేన పి ఏ సీ సభ్యుడు కోన తాతారావు పేర్కొన్నారు.విశాఖ లో మీడియా సమావేశంలో మాట్లాడారు.ప్రతి పక్ష నేత చంద్రబాబు నాయుడు అరెస్ట్ అణచివేత లో భాగమే అన్నా రు. జన సేన నేతపంచ కర్ల రమేష్ బాబు మాట్లాడుతూ, మంత్రులు మాటలు పైచా సిక ఆనందం పొంద డానికే అని అర్థం అవుతుంది అన్నారు. తప్పులు చేస్తే అరెస్ట్ చేయొచ్చు, కానీ, అర్థ రాత్రి పూట ఒక మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ను అరెస్ట్ చేయ డం అన్యాయం అన్నారు. చంద్ర బాబు నాయుడు కి జనసేన మద్దతు ఇవ్వడం తప్పు అన్నట్టు వైసీపీ మం త్రులు ప్రకటనలు గుప్పిస్తున్నారు అన్నారు. రాష్ట్ర మం త్రి అమర్నాథ్ నడ మంత్రపు సిరి చందంగా మిడిసి పడుతున్నారు. చంద్ర బాబు నాయుడు స్వంత కొడుకు కన్నా పవన్ కళ్యాణ్ కు ఎందుకు బాధ అని వైసీపీ శ్రేణులు విడ్డూరంగా మాట్లాడుతున్నారు అని విమర్శించారు.పదవికి ముందు ఆస్తులు ఎంత అని ప్రశ్నించారు.సీఎం మెప్పు కోసమే దోపిడీ ప్యాకేజీలు చేసేది అమర్నాథ్ అన్నారు.పవన్ కళ్యాణ్ తిట్టడమే పని అని చెప్పావు అని గుర్తు చేశారు. పవన్ కళ్యాణ్ ను ఎందుకు అడ్డుకున్నారు అని ప్రశ్నించారు. జన సేన ప్రభుత్వం వేస్తే మీరు జైలుకి వెళ్ళడం ఖాయం అన్నా రు. ఉత్తర నియోజక వర్గం సమన్వయ కర్త పసుపు లేటి ఉషా కిరణ్ మాట్లాడుతూ, ఊసర వెల్లి మంత్రి రోజా నోరు డంపింగ్ యార్డు తలపిస్తుంది అని ఎద్దేవా చేసారు. అక్రమ సంపాదన ఎంతో ప్రజలకు తెలుసు అని తెలిపారు.విశాఖ బీచ్ లో రెండు హోటల్స్ నిర్మా ణం ఏమయింది అని ప్రశ్నించారు. టీడీపీ బంద్ విఫలం అవ్వలేదు ప్రభుత్వం అణిచివేత ధోరణి తో వ్యవహరించి హౌస్ అరెస్ట్ లు చేశారు అని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. మీడియా సమావేశంలో జనసేన వీర మహిళ ప్రశాంతి కూడా పాల్గొన్నారు.

## ఎంపి మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలు

**మదనపల్లె**
అతి చిన్న వయసులోనే డిప్యూటీ ప్యానల్ స్పీకర్ గా ఎదిగిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి మరిన్ని జన్మదినాలు జరుపుకోవాలని మదనపల్లే ఎమ్మెల్యే నవాజ్ భాషా ఆకాంక్షించారు. నేడు మదనపల్లె పట్టణంలోని మార్కెట్ యార్డులో ఘనంగా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. మొదటగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నూర్అజామ్, మార్కెట్ కమిటీ చైర్మన్ తట్టి శారదమ్మ, వైస్ చైర్మన్ వెంకటరమణ, డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి మరిన్ని జన్మదినాలు జరుపుకోవాలని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు.

## అంబేద్కర్ భవనం నూతన కమిటీ ఎన్నిక

**బద్వేలు**
బద్వేల్ పట్టణంలో ఉన్న అంబేద్కర్ భవన ప్రాంగణం ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదని భవనం అభివృద్ధి చెందడం దళిత ప్రజా సంఘాలకు దళిత ప్రజానీకానికి ఎంతో అవసరమని అందుకు ఒక కమిటీ ఉండాలని మంగళవారం బద్వేలు ఆర్టీసీ ఎంప్లాయిస్ ఆఫీస్ కార్యాలయం నందు దళిత ప్రజా సంఘాల ప్రతినిధుల సమావేశం ఏపీ దళిత చైతన్యపురం రాష్ట్ర అధ్యక్షులు సొద్దల పెంచలయ్య అధ్యక్షత సమావేశం నిర్వహించడమైనది ఈ సమావేశము నందు కమిటీ అధ్యక్షులుగా కూకట్పల్లి మురళి ఉపాధ్యక్షులుగా చాట్ల సామేలు ప్రధాన కార్యదర్శిగా నుస్మి గౌస్ పీర్ ట్రెజరర్ గా నాగిపోగు విజయమ్మ ఎన్నుకోవడం అయినది కమిటీ సభ్యులుగా వంకెల సుబ్బరాయుడు కొత్త పి పెంచలయ్య ఎలక చర్ల చిన్నయ్య ఎమ్మార్పీఎస్ నాయకులు నర్సింలు దళిత వేదిక జిల్లా కన్వీనర్ ఓబన్నను ఎన్నుకోవడం అయినది అడ్వైజర్ కమిటీ సభ్యులు ప్రసాదు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నారాయణ జంపారపు భాస్కర్ డిపిఎఫ్ జిల్లా కార్యదర్శి చిన్నయ్య ను ఎన్నుకోవడం అయినది ఈ సమావేశానికి ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యులు కొండూరు లక్ష్మీనారాయణ దళిత నాయకులు రాంబాబు బాలయ్య సంఘమిత్ర కోఆర్డినేటర్ అభిలాష్ పాల్గొన్నారు

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**కోరుట్ల**
కోరుట్ల ప్రెస్ క్లబ్, మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని మోహన్ రావు పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని నిర్వాహకులు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ముక్కెర చంద్రశేఖర్ తెలిపారు..ఈ సందర్భంగా నిర్వహించినవైద్య శిబిరంలో సుమారు 300 మందికి షుగర్, బీపీ,తదితర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు..అలాగే ఇందులో ఐదుగురి కి శస్త్ర చికిత్సలు అవసరం ఉండగా వారికి ఉచితంగా చేస్తామని ఐఎంఏ వైద్యులు హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కార్యదర్శి ఆకుల మల్లికార్జున్,ఉపాధ్యక్షుడు సలీం ఫారుఖీ, ఐఎంఏ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వై. అనుప్ రావు, పట్టణ అధ్యక్షులు డాక్టర్ రేగొండ రాజేష్, సెక్రటరీ డాక్టర్ కటుకం జగదీశ్వర్, కోశాధికారి గంద్ర అన్వేష్, డాక్టర్ మహదేవ్, ముక్క ఇంద్రనీల్ ,డాక్టర్ సంతోష్ ,డాక్టర్ రమేష్ ,డాక్టర్ మనోజ్, డాక్టర్ నరేష్ ,స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ స్వీతి అనూఫ్ , గ్రామ సర్పంచ్ సరికెళ్ల మల్లారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కార్పొరే నర్సయ్య ,వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ,ఆశా వర్కర్లు,పాత్రికేయులు రాజు , గజం శంకర్, నటరాజ్ ,సతీష్, నవీన్, సుమన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## మంగళవారం కోసం ఎదురుచూపులు

### యాచకులకు నగదు దానం చేస్తున్న వ్యాపారి కుటుంబం



పుట్టేటప్పుడు తెచ్చింది లేదు. . పోయేటప్పుడు తీసుకెళ్లేది లేదన్నది జగమెరిగిన సత్యం. సంపాదించిన దాంట్లో ఎంతో కొంత దానం చేస్తే కలిగే సంతృప్తి వెలకట్టలేనిది. ఎంత సంపాదించిన దానం చేయడానికి కొందరికి మనస్సు రాని రోజులవి. అయితే నెల్లూరు జిల్లా నాయుడుపేటకు చెందిన ఓ వ్యాపారి కుటుంబం మాత్రం వారానికి ఒకరోజు నగదు దానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. నాయుడుపేటకు చెందిన సురేష్ అతని కుమారుడు సురేంద్ర అల్లుడు కళ్యాణ్ మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చి దర్శించుకుని వెళుతుంటారు. స్వామివారిని దర్శించుకున్న తరువాత ప్రతి యాచకునికి రూ20 చొప్పున దానం చేస్తుంటారు. ఇలా ఎన్నో సంవత్సరాలుగా ప్రతి వారం వచ్చి పోతుంటారు. దీంతో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 గంటలకు రాహుకాలం ముగియగానే ఎక్కడెక్కడో ఉన్న యాచకులంతా దాతల కోసం ఆలయం సమీపంలో బారులు తీరుతారు. సుమారు 1000 మంది యాచకులు ప్రతి వారం కొన్నేళ్లుగా ప్రత్యేకంగా ఓ కుటుంబం కోసం నిరీక్షించడం చూసేవారికి విశేషంగా కనిపిస్తుంది. పుచ్చుకున్న యాచకులందరూ దాతలను చల్లగుండాలంటూ దీవిస్తుంటారు.

# "రామన్న యూత్" ప్రీ రిలీజ్ వేడుక




టాలెంటెడ్ యంగ్ యాక్టర్ అభయ్ నవీన్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన సినిమా "రామన్న యూత్". ఎంటర్ టైనింగ్ పొలిటికల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఫైర్ ఫ్లై ఆర్ట్స్ సంస్థ నిర్మించింది. "రామన్న యూత్" సినిమా ఈ నెల 15న విడుదలకు సిద్ధమవుతోంది. సోమవారం సాయంత్రం ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాస్ కా దాస్ విశ్వక్ సేన్, ప్రియదర్శి, తిరువీర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాక్టర్ అనిల్ గీల మాట్లాడుతూ - మై విలేజ్ షో ద్వారా మాకెంతో పేరొచ్చింది. ఎంతోమంది స్టార్ హీరోలు తమ సినిమాల ప్రమోషన్ కోసం మా విలేజ్ కు వచ్చారు. వాళ్లు వెళ్లేప్పుడు సినిమాలో అవకాశం ఉంటే ఇమ్మని అడిగేవాళ్లం. అయినా పెద్దగా అవకాశాలు రాలేదు. కొన్ని సినిమాలు చేసినా చాలా చిన్న క్యారెక్టర్స్ వచ్చాయి. అలాంటి టైమ్ లో అభయ్ నవీన్ అన్న ఈ సినిమా కథ చెప్పాడు. పోస్టర్ మీద నీ ఫొటో ఉంటది అన్నాడు. ఈ సినిమా చేసేప్పుడు ఫిల్మ్ మేకింగ్ ఎంత కష్టమో చూశాను. అవన్నీ ఎదుర్కొని అభయ్ అన్న సినిమా కంప్లీట్ చేశాడు. మంచి సినిమా అయితేనే చాలదు. దాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లేందుకు చాలా పనులు ఉంటాయి. మా చిత్రాన్ని థియేటర్ లో చూడండి. మీకు నచ్చుతుంది. అన్నారు.యాక్టర్ యాదమ్మ రాజు మాట్లాడుతూ - జార్జ్ రెడ్డి సినిమా చేసినప్పటి నుంచి అభయ్ అన్నతో పరిచయం. ఈ సినిమాలో మంచి రోల్ ఇచ్చాడు. విలేజ్ లో జరిగే ఇంట్రెస్టింగ్ పొలిటికల్ డ్రామా ఇది. ఈ నెల 15న థియేటర్స్ లో చూసి ఎంజాయ్ చేయండి. అన్నారుయాక్టర్ తాగుబోతు రమేష్ మాట్లాడుతూ - సినిమాల్లో ఎవరు బాగా నటించినా నేను ఫోన్ చేసి అప్రిషియేట్ చేస్తుంటాను. అలా పెళ్లి చూపులు టైమ్ నుంచి అభయ్ ఏ సినిమాలో నటించినా ఫోన్ చేసి చెప్పేవాడిని. అలా మా మధ్య స్నేహం మొదలైంది. ఒక రోజు నన్ను కలిసి కథ చెప్పాడు. ఒక చిన్న పాయింట్ ను ఎంతో ఆకట్టుకునేలా కథ నెరేట్ చేశాడు. తమిళ, మలయాళ సినిమాలు చూసినప్పుడు ఒక చిన్న పాయింట్ తో ఎంత బాగా సినిమా చేశారనిపిస్తుంది. ఈ కథ విన్నప్పుడు నాకు అలా అనిపించింది. రామన్న యూత్ లో నాకు అనిల్ అన్న అనే క్యారెక్టర్ ఇచ్చాడు. సగం సినిమాలో నేనుంటా, మిగతా సగంలో నా పేరు వినిపిస్తుంటుంది. అభయ్ ఎంతో క్లారిటీగా సినిమాను తెరకెక్కించాడు. అతని హార్డ్ వర్క్ చూసి ఆనందంగా అనిపించింది. ఈ సినిమాకు సపోర్ట్ ఇచ్చేందుకు వచ్చిన విశ్వక్, ప్రియదర్శి, తిరువీర్ కు థాంక్స్ చెబుతున్నా. అన్నారు. హీరో తిరువీర్ మాట్లాడుతూ - ఒకప్పుడు నాతో కలిసి ఆటోలో తిరిగిన అభయ్ నవీన్ ఇప్పుడు ఇలా సినిమా చేశాడని అంటే ఆనందంగా ఉంది. డబ్ స్మాష్ ద్వారా చాలా వీడియోలు చేసేవాడు. కలిసి సినిమాలో నటించాం. అవకాశాల కోసం ఆడిషన్స్ ఇచ్చిన అభయ్..ఇప్పుడు డైరెక్టర్ అయి మా ఫ్రెండ్స్ కు అవకాశాలు ఇవ్వడం సంతోషంగా ఉంది. అభయ్ డైరెక్టర్, రైటర్, ఎడిటర్ అన్నీ అయ్యాడు. ఇది అతని కెరీర్ లో మొదటి మెట్టు మాత్రమే. తన సినిమాను రిలీజ్ వరకు తెచ్చుకోవడమే అభయ్ ఫస్ట్ సక్సెస్. ఈ సినిమాకు అతనికి సపోర్ట్ చేసిన అందరికీ థాంక్స్. అభయ్ నాకు కూడా కథ చెప్తా అన్నాడు. ఈ నెల 15న లాంగ్ వీకెండ్ వస్తోంది. సినిమాను థియేటర్ లో చూడండి. ఎంకరేజ్ చేయండి. మీరు సపోర్ట్ చేస్తే అభయ్ రామన్న యూత్ లాంటి మంచి సినిమాలు మరిన్ని చేస్తాడు. అన్నారు.

# రూల్స్ రంజన్' అక్టోబర్ 6 న విడుదల




సుప్రసిద్ధ నిర్మాత ఏ.ఎం. రత్నం సమర్పణలో స్టార్ లైట్ ఎంటర్టైన్మెంట్ పతాకంపై దివ్యాంగ్ లవానియా, మురళి కృష్ణ వేమూరి నిర్మిస్తున్న చిత్రం 'రూల్స్ రంజన్'. కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి రత్నం కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. రింకు కుక్రెజ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అమ్రిష్ గణేష్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన పాటలకు, ప్రచార చిత్రాల కు అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా విడుదల అయిన సినిమా ట్రైలర్ సగటు సినిమా ప్రేక్షకుడిని వినోదంలో ముంచెత్తింది. 'రూల్స్ రంజన్' నుంచి విడుదల అవుతున్న ప్రతీ ప్రచార చిత్రం సినిమా చూడాలనే ఆసక్తిని రెట్టింపు చేస్తోంది. అమ్రిష్ గణేష్ పాటలలోనే కాదు నేపథ్య సంగీతంలో కూడా తన మెరుగైన ప్రతిభను కనబరుస్తున్నారు. ప్రతి ఒక్కరూ సినిమా చూసి వినోదం లో తెలియాడాలనే ఉద్దేశ్యం, మరింత మందికి చేరువ కావాలనే సదుద్దేశ్యంతో , పూర్తి స్థాయి వినోద భరితంగా రూపొందుతోన్న ఈ చిత్రం ను అక్టోబర్ 6 న థియేటర్లలో భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు చిత్ర దర్శక, నిర్మాతలు తెలిపారు . ఈ మేరకు ఆకట్టుకునే నూతన ప్రచార చిత్రాన్ని విడుదల చేసింది చిత్ర బృందం. చిత్ర కథ, దానికి అనుగుణంగా సాగే సన్నివేశాలు, వాటికి తగ్గట్లుగా సంభాషణలు, వీటన్నింటినీ స్థాయిని పెంచే రీతిలో నేపథ్య సంగీతం, సందర్భ శుద్ధి గా సాగే పాటలు ప్రేక్షకుడిని అమితంగా ఆకట్టుకుంటాయి అని అన్నారు నిర్మాతలు.

తారాగణం: కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి, మెహర్ చాహల్, వెన్నెల కిషోర్, సుబ్బరాజు, హైపర్ ఆది, వైవా హర్ష, అన్నూ కపూర్, అజయ్, అతుల్ పర్చురే, విజయ్ పాట్కర్, మకరంద్ దేశ్‌పాండే, నెల్లూరు సుదర్శన్, గోపరాజు రమణ,

# 'స్వయంభూ' పోస్టర్ విడుదల

హీరో నిఖిల్, భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తన ల్యాండ్‌మార్క్ 20వ సినిమా 'స్వయంభూ' కోసం నెల రోజుల పాటు కఠోర శిక్షణ కోసం ఇటీవలే వియత్నాం వెళ్లారు. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్‌పై భువన్, శ్రీకర్ ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. నిఖిల్ లెజెండరీ యోధుడి పాత్రలో నటించేందుకు ఆయుధాలు, మార్షల్ ఆర్ట్స్, గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకుంటున్నారు. అద్భుతమైన వార్ సీక్వెన్సులు ఉండే ఈ సినిమాలో నిఖిల్ ఎక్స్ టార్డినరీ స్టంట్స్ చేయబోతున్నారు. లేటెస్ట్ అప్‌డేట్ ఏమిటంటే.. అందం, అభినయంతో బ్యాక్ టు బ్యాక్ బ్లాక్‌బస్టర్స్‌తో దూసుకుపోతున్న సంయుక్త ఈ చిత్రంలో నిఖిల్ సరసన కథానాయికగా నటిస్తున్నారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా, ఓ ఆసక్తికరమైన పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఒక పెద్ద కోట ముందు నిండైన ఆభరణాలతో విగ్రహ రూపంలో యువరాణిలా కనిపిస్తున్నారు సంయుక్త. ఆమె చేతిలో ఒక పక్షి కూడా వుంది. సంయుక్త పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.'స్వయంభూ' హై బడ్జెట్, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో రూపొందిస్తున్నారు మేకర్స్. రవి బస్రూర్ సంగీతం సమకూరుస్తుండగా, మనోజ్ పరమహంస సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఎం ప్రభాహరన్ ప్రొడక్షన్ డిజైనర్ గా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి వాసుదేవ్ మునెప్పగారి డైలాగ్స్ అందిస్తున్నారు.



# లేడీస్ కోసం 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' స్పెషల్ షో

నవీన్ పొలిశెట్టి. అనుష్క జంటగా నటించిన 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' సినిమా రీసెంట్ గా ప్రేక్షకుల ముందుకొచ్చి బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఈ సినిమా క్లీన్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా ప్రేక్షకుల అప్రిషియేషన్స్ తో పాటు చిత్ర పరిశ్రమలోని స్టార్ హీరోలు, హీరోయిన్స్, డైరెక్టర్స్, ప్రొడ్యూసర్స్ నుంచి ప్రశంసలు అందుకుంటోంది. తెలుగు రాష్ట్రాల్లో స్టడీ కలెక్షన్స్ సాధిస్తూ. ..యూఎస్ లో వన్ మిలియన్ మార్క్ అందుకుందీ సినిమా. తమ సినిమాను ఇంతగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు, సినీ ప్రియులకు, ఇండస్ట్రీ సెలబ్రిటీస్ కు థాంక్స్ చెప్పింది హీరోయిన్ అనుష్క. ఈ గురువారం ఏపీ తెలంగాణలో లేడీస్ కోసం 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' స్పెషల్ షో ప్రదర్శించబోతున్నారు. ఈ నేపథ్యంలో హీరోయిన్ అనుష్క మాట్లాడుతూ - అందరికీ నమస్కారం. మా మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి సినిమాను ఇంతగా ఆదరిస్తున్నందుకు థాంక్స్. మీ మెసేజెస్, ట్వీట్స్, ప్రేమ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. ఈ గురువారం ఏపీ తెలంగాణలోని థియేటర్స్ లో లేడీస్ కోసం మా మూవీ స్పెషల్ షో ప్రదర్శిస్తున్నాం. మీ ఇంట్లో చిన్నవాళ్లను, పెద్ద వాళ్లను ఈ స్పెషల్ షోకు తీసుకువెళ్లండి. మీ రెస్పాన్స్ కోసం వేచి చూస్తుంటాను. అని చెప్పింది.



Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950